



నున్న మామిడి మార్కెట్‌లో కాయల గ్రేడింగ్



పొట్టిదిబ్బలంక ప్రధాన రోడ్డుకు అనుకుని మట్టి తవ్వకాలు

తోట్లవల్లూరు మండలంలో మట్టి మాఫియా చెలరేగిపోతోంది. పొట్టిదిబ్బలంకలో అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టింది. రెండు రోజులుగా ఎక్స్‌కవేటర్‌తో రేయింబవళ్లు లారీల్లోకి మట్టి లోడింగ్ చేయించి ఉయ్యూరు వైపు యథేచ్ఛగా తరలిస్తోంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీ ఫీజుకు సైతం ఎగనామం పెడుతోంది. మట్టి తవ్వకాల విషయం బయటకు రావడంతో తమకు ఇప్పుడే తెలిసిందన్నట్టు వీఆర్వో నాగేశ్వరరావు ఓవరాక్షన్ చేశారు. మట్టి లారీలకు తన స్కూటీని అడ్డుపెట్టి మరీ ఆపారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఆ లారీలను వదిలేశారు. రెవెన్యూ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పొట్టిదిబ్బలంకలో అనధికార మట్టితవ్వకాలు

మట్టి దందా!

పొట్టిదిబ్బలంకలో అనుమతి లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు

- 2 రోజులుగా ఎక్స్‌కవేటర్‌తో రేయింబవళ్లు లారీల్లోకి మట్టి లోడింగ్
- రాయల్టీ చెల్లింపులు లేకుండా ఉయ్యూరు వైపు రవాణా
- స్కూటీని అడ్డుపెటి లారీలను ఆపిన వీఆర్వో నాగేశ్వరరావు
- ఆ తర్వాత లారీలు, ఎక్స్‌కవేటర్‌ను వదిలివేసిన వైనం
- రెవెన్యూ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

తోట్లవల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరుల మండలం దేవరపల్లి రెవెన్యూ పరిధిలోని పొట్టిదిబ్బలంకలో కళ్లంవారిపాలేనికి చెందిన రైతు దేవరపల్లి వెంకటేశ్వరరావు పొలంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మట్టి తవ్వకాలు చేపట్టారు. గత రెండు రోజులుగా 24 గంటలు పెద్ద యంత్రంతో మట్టిని తవ్వి లారీల ద్వారా రవాణా చేస్తున్నారు. మండల కేంద్రమైన తోట్లవల్లూరులో ప్రభుత్వ కార్యాలయాల పక్కగానే ఉయ్యూరు వైపుగా లారీలు మట్టిని రవాణా చేస్తున్నాయి. బుధవారం రాత్రి తోట్లవల్లూరు సెంటర్లో మట్టి లారీలు ఆగాయి. ఆరా తీస్తే పొట్టిదిబ్బలంక నుంచి అని తెలిసింది. గురువారం ఉదయం పొట్టిదిబ్బలంక వెళ్లి పరిశీలించగా, 200 పవర్ గల యంత్రంతో మట్టిని తవ్వి లారీల్లోకి నింపుతున్నారు. అక్కడ ఓ యువకుడు పుస్తకం చేతపట్టి లారీల నెంబరు రాస్తు కూర్చున్నాడు. అనుమతి ఉందా ఎవ్వరు తవ్విస్తున్నారు అని అడగ్గా గన్నవరానికి చెందిన శైలేష్ తవ్విస్తున్నారు, నా ఊరు గన్నవరం అని సమాధానం ఇచ్చాడు. అనుమతి ఉందా అంటే నాకు తెలియదని, నేను లారీలను నోట్ చేసుకోవటమేనని చెప్పాడు. రెండు రోజులుగా సుమారు అరెకరం పొలంలో మట్టిని అక్రమంగా తవ్వేశారు. అధికారులకు తెలిసే అక్రమ మట్టితవ్వకాలు చేపట్టారనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి.

మొక్కజొన్న పండే పొలంలో..

రైతు వెంకటేశ్వరరావు ఈ పొలంలో మొక్కజొన్న పంట పండించినట్టు స్థానికులు తెలిపారు. పంటలు సాగు చేసుకునేందుకు అనువైన భూమిని కేవలం డబ్బుల కోసమే మట్టి తవ్వకాలకు ఇచ్చారని చెబుతున్నారు. పంటల సాగుకు అనుకూలంగా లేకుంటే అధికారులకు అర్జీ పెట్టి అనుమతి పొంది చదును చేసుకోవచ్చు. రెండేళ్ల క్రితం పక్క రైతులు ఇదేవిధంగా అక్రమంగా మట్టి తవ్వకాలు చేయటంతో రైతు వెంకటేశ్వరరావు కూడా తవ్వకాలకు భూమిని ఇచ్చినట్టు తెలుస్తోంది.

పట్టుకున్న లారీలను వదిలేసిన వీఆర్వో

మట్టితవ్వకాల వద్దకు విలేకరులు వచ్చిన విషయాన్ని తెలుసుకున్న వీఆర్వో బి.నాగేశ్వరరావు పొట్టిదిబ్బలంక వచ్చారు. ఆయన వచ్చినపుడు రెండు మట్టిలోడు లారీలు నదీపాయలోని రహదారిలో ఎదురుపడ్డాయి. దాంతో వీఆర్వో నాగేశ్వరరావు తన స్కూటీని లారీలు వెళ్లకుండా రహదారిలో అడ్డుగా పెట్టారు. ఎక్స్‌కవేటర్‌ను కూడా ఆపేశారు. అనుమతులు లేకుండా ఎవ్వరు మిగతా 6లో..

రహదారికి ప్రమాదం

ప్రస్తుతం వెంకటేశ్వరరావు పొలంలో జరిపిన మట్టితవ్వకాలతో రహదారికి ప్రమాదమని పొట్టిదిబ్బలంక ప్రజలు చెబుతున్నారు. ఓ పక్క రహదారి, మరో పక్క కృష్ణానది అంచున ఉన్న పొలంలో భవిష్యత్తులో సంభవించే నష్టాలను ఆలోచించకుండా మట్టిని తవ్వటంపై మిగితా రైతులు, ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కృష్ణానదికి వరదలు సంభవించినపుడు రహదారి కోతకుగురై విరిగిపోయో ప్రమాదం ఏర్పడుతుందని అంటున్నారు.

మామిడీలా!

- వెలవెలబోతున్న నున్న మ్యాంగో మార్కెట్
- గతంతో పోలిస్తే పడిపోయిన అమ్మకాలు
- కోడిపేను తెగులుతో పాడైపోయిన కాయలు
- అకాల వర్షం, గాలివానల ప్రభావం ఎక్కువే..
- ఎగుమతులు లేక కుదేలైన రైతులు, వ్యాపారులు

విజయవాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది మామిడి వ్యాపారం కుదేలైంది. కరోనా సమయాన్ని మినహాయిస్తే దశాబ్దకాలంలో ఎన్నడూ లేనంతగా ఎగుమతులు పడిపోయాయి. ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులు, వాహనాలతో ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ మార్కెట్ ఆసియాలోనే అతిపెద్దది. అలాంటి మార్కెట్‌లో ఈసారి దుకాణాలు అరకొర కాయలతోనే కనిపిస్తున్నాయి. అకాల వర్షాలు, గాలివానలకు తోడు అటు కోడిపేను తెగులు, ఇటు మామిడి రైతులనే కాకుండా వ్యాపారులను కూడా నిండా ముంచేసింది.

అకాల వర్షాలు, తెగుళ్లతో తగ్గిన దిగుబడి

ఈ ఏడాది ఎన్నడూ లేనంతగా మామిడి పూత పూసింది. అయితే, కాయకాసే సమయానికి కోడిపేను తెగులు పట్టి పూత మొత్తం మాడిపోయింది. గోరుచుట్టు మీద రోకలిపోటు అన్నట్టు అకాల వర్షాలు, గాలివానలతో పంట దిగుబడి భారీగా తగ్గిపోయింది. కాసిన అరకొర కాయలు కూలీలను పెట్టి కోసి మార్కెట్‌కు తీసుకొచ్చే పరిస్థితులు లేవు.

పడిపోయిన ఎగుమతులు

గతంతో పోలిస్తే మ్యాంగో మార్కెట్‌లో ఎగుమతులు భారీగా పడిపోయాయి. గతంలో ఇక్కడి నుంచి సీజన్‌లో రోజుకు 400 నుంచి 500 టన్నుల ఎగుమతులు జరిగేవి. అయితే ఈ ఏడాది రోజుకు 200 టన్నులు ఎగుమతులు కావడమే కష్టంగా మారింది.

టన్ను రూ.25 వేలు పలికితే ఎక్కువే..

మామిడి సీజన్ ప్రారంభ, ముగింపు సమయాల్లో బంగినపల్లి, రసాలు టన్ను రూ.50 వేల నుంచి రూ.55 వేల వరకు పలికేది. ఇక సీజన్‌లో టన్ను రూ.30 వేల నుంచి రూ.35 వేలు ఉండేది. అయితే, ఈ ఏడాది సీజన్‌లో టన్ను మొదటి క్వాలిటీ రూ.25 వేలు పలకడం గగనమైంది. తక్కువ రకం కాయల ధరలు రూ.10 వేల నుంచి రూ.15 వేలు పలికితే ఎక్కువగా ఉంది. సాధారణంగా మూడు టన్నుల కాయలు కూలీలను పెట్టి కోసి మార్కెట్‌కు వాహనాల ద్వారా తరలించేందుకు రూ.10 వేలపైనే రైతులకు ఖర్చవుతుంది. మొదటి రకం కాయలైతే ఫర్వాలేదు కానీ, తక్కువ రకం కాయలైతే రైతులకు కూడా మిగిలేదేం ఉండదు.

అకాల వర్షంతో లావెక్కిన కాయలు

నున్న మామిడి మార్కెట్ నుంచి ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ఎగుమతులు అవుతుంటాయి. ఆయా రాష్ట్రాల్లో మన మామిడికి మంచి డిమాండ్ ఉంది. అయితే, అకాల వర్షం కారణంగా కాయ నీరెక్కి సైజు పెరగడం ఎగుమతులపై ప్రభావం చూపిందని వ్యాపారులు చెబుతున్నారు. సైజు పెరిగిన కాయ కొనడానికి ఆయా రాష్ట్రాల్లో వినియోగదారులు ఇష్టపడరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్థానిక సమరానికి సన్నద్ధమయ్యేలా..

- 18 నుంచి ఉమ్మడి కృష్ణాలో మినీ మహానాడుకు సన్నాహాలు
- మూడు రోజుల పాటు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో..
- 22, 23 తేదీల్లో జిల్లాస్థాయిలో నిర్వహణ 6లో



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న రైతులు

మూడో టవర్ నిర్మాణానికి అనుమతివ్వబోం

- అలైన్‌మెంట్ ఎందుకు మార్చారో చెప్పాలి
- అధికారులను నిలదీసిన రైతులు
- నీళ్లు నమిలిన విద్యుత్ శాఖ అధికారులు
- ఆర్డీవో కార్యాలయంలో రసాభాసగా రైతుల సమావేశం

గుడివాడ, మే 15(ఆంధ్రజ్యోతి): "తమ పొలాల గుండా మూడో టవర్ నిర్మాణానికి తామంతా అనుమతించబోం. ఉన్న రెండు టవర్‌ల మధ్యలో నుంచి విద్యుత్ లైను వేసుకోండి. లేనిపక్షంలో తామంతా కోర్టును ఆశ్రయిస్తాం. అసలు విద్యుత్ లైన్‌ల ఏర్పాటు అలైన్‌మెంట్‌ను రెండు సార్లు ఎందుకు మార్చాల్సి వచ్చిందో చెప్పాలి" అంటూ రైతులు అధికారులను నిలదీశారు. సమాధానం చెప్పాల్సిన విద్యుత్ శాఖ అధికారులు నీళ్లనమిలారు. గుడివాడ(లింగవరం) - యలమర్రు వరకు ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో మూడు మండలాల గుండా గతంలో 130, 220 కె.వి రెండు విద్యుత్ టవర్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పలుమార్లు లైన్ల తాలుకు అలైన్‌మెంట్‌లను మార్చారు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే క్రమంలో మరో విద్యుత్ లైను ఏర్పాటుకు ఏపీ ట్రాన్స్‌కో సిద్ధమైంది. దీనిపై గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వేదికగా ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన మూడు మండలాల తహశీల్దార్లు, రైతులు, విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. గతంలో రెండు పర్యాయాలు అలైన్‌మెంట్‌ను ఎందుకు మార్చారో అధికారులు స్పష్టత ఇవ్వాలని, ఎవరికి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు తమను బలి చేశారో చెప్పాలని రైతులు పట్టుబట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జరిగిందని విద్యుత్ అధికారులు చెప్పే ప్రయత్నం చేశారు. అదే గ్రామాల గుండా మూడో విద్యుత్ లైను ఏర్పాటు పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే తమ పంట పొలాల గుండా రెండు టవర్ల ఏర్పాటు చేశారని, వాటి మధ్యలో లేదా వాటి మీదనే మరో విద్యుత్ లైను ఏర్పాటు చేసుకోవాలని రైతులు అధికారులకు సూచించారు. టెక్నికల్‌గా కుదరదని, మూడో విద్యుత్ లైను ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాల నిమిత్తం విద్యుత్ లైను ఏర్పాటు తప్పదని స్పష్టం చేశారు. మచిలీపట్నం పోర్టు, పెడన తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిమిత్తం మూడో లైను ఆవశ్యకత ఉందన్నారు. దీనిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తామంతా పొలాల గుండా మరో విద్యుత్ లైను ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామని, కోర్టును ఆశ్రయిస్తామని తేల్చి చెప్పారు. ఎటు తేలకుండానే సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో గుడివాడ, లింగవరం, మెరకగూడెం, జొన్నపాడు, గుర్విందగుంట, పెదపారుపూడి రైతులు, ఏపీ ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

ఇక విత్తన కష్టాలు!

- ఖరీఫ్‌లో వరి సాగు అంచనా 1,62,123 హెక్టార్లు
- కావాల్సిన విత్తనాలు 1.03 లక్షల క్వింటాళ్లు
- ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చేది 11,600 క్వింటాళ్లే!
- మిగిలిన విత్తనాలకు ప్రైవేటు వ్యాపారులే దిక్కు
- విత్తనాల ధర క్వింటా రూ.3,250 నుంచి రూ.3,800



ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. రుతుపవనాలు ముందస్తుగానే వస్తాయని వాతావరణశాఖ చెబుతోంది. సకాలంలో వర్షాలు కురిసి వాతావరణం సాగుకు అనుకూలంగా మారితే జూన్ రెండో వారం నుంచి జూలై రెండో వారంలోగా వరి నారు మడులు పోసుకునేందుకు అవకాశం ఉంటుంది. వ్యవసాయశాఖ ద్వారా వరి విత్తనాలు కావాలని ఇప్పటికే రైతులు ఇండెంట్ పెట్టారు. అయితే ఎంత మేరకు విత్తనాలు అందుబాటులో ఉంచుతారనే అంశంపై అనేక అనుమానాలున్నాయి. ఈ ఏడాది కూడా రైతులకు విత్తన కష్టాలు తప్పేటట్టులేవు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1,62,123 హెక్టార్లలో వరి సాగు జరగనుందని వ్యవసాయశాఖ అంచనా. ఎకరానికి కనీసంగా 25 కిలోల విత్తనాలను నారు మడులుగా పోస్తారు. వ్యవసాయశాఖ ద్వారా 11,600 క్వింటాళ్ల వరి విత్తనాలను క్వింటాకు రూ.500 సబ్సిడీగా ఇవ్వాలని నిర్ణయించారు. 1.03 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే విత్తనాలు మినహా సుమారుగా 90 వేల క్వింటాళ్ల విత్తనాలను బహిరంగ మార్కెట్‌లో రైతులు కొనుగోలు చేయాల్సి ఉంది. వ్యవసాయశాఖ ద్వారా బీపీటీ 5204, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 వంటి రకాల వరి విత్తనాలను అందించాలని నిర్ణయించారు. చెరకు 3,549 హెక్టార్లలో, మినుము 1,340 హెక్టార్లలో, వేరుశెనగ 724 హెక్టార్లలో, పత్తి 298 హెక్టార్లలో, ఇతర పంటలు 133 హెక్టార్లలో సాగు చేయనున్నారు. చెరకు మినహా మిగిలిన రకాల పంటలకు సంబంధించిన విత్తనాలను రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్దనే కొనుగోలు చేయాలి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న భూమి పరిస్థితులు, భూసారం, పంట సాగు చేసే సమయాన్ని బట్టి ఆయా గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో ఏ రకం వరి వంగడాలను సాగు చేయాలనే అంశంపై వ్యవసాయశాఖ ముందస్తుగానే ప్రణాళికను తయారు చేసి రైతులకు తెలియజేస్తూ ఆర్‌ఎస్‌కేల వద్ద, ప్రధాన కూడళ్లలో గోడలపై రాస్తారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం విత్తనాల ధర కిలోకు రూ.32 నుంచి రూ.38 వరకు ఉంటుందని అంచనా.

కరీంనగర్, వరంగల్, గోదావరి జిల్లాల నుంచి వరి విత్తనాలు

తెలంగాణలోని కరీంనగర్, వరంగల్, ఉభయ గోదావరి జిల్లాల నుంచి ప్రైవేటు వ్యాపారులు అధికంగా వరి విత్తనాలను దిగుమతి చేసుకుంటారు. ఇందులో సర్టిఫైడ్, నాన్ సర్టిఫైడ్ మిగతా 6లో..

ప్రైవేటు వ్యాపారుల కనుసన్నల్లోనే..

వ్యవసాయశాఖ అధికారులు సూచనల మేరకు వరి వంగడాలను సాగు చేయాలని రైతులు ఆలోచన చేసినా క్షేత్రస్థాయిలో అమలు కాని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సీజన్‌లో ఎంటీయూ 1061, 1064, 1121, 7029, 1318, 1224, స్వర్ణ, బీపీటీ-5204 వంటి వరి వంగడాలను జిల్లా రైతులు సాగు చేస్తారు. కానీ వ్యవసాయశాఖ ద్వారా ఎంటీయూ 1061, 1318, 1262, బీపీటీ 5204, రకాలను మాత్రమే ఇస్తామని చెబుతున్నారు. మిగిలిన అన్ని రకాల వరి వంగడాలను ప్రైవేటు వ్యాపారుల నుంచే రైతులు కొనుగోలు చేయాల్సి ఉంది. ప్రైవేటు వ్యాపారులు తమ వద్ద ఉన్న వరి వంగడాలు దిగుబడులు అధికంగా వస్తాయని చెప్పి రైతులకు అంటగడతారు. దీంతో ప్రైవేటు వ్యాపారుల సూచనల మేరకే రైతులు వరి వంగడాలను రైతులు ఎంచుకోవాల్సినస్థితి ఏర్పడుతోంది. ప్రైవేటు వ్యాపారులు ఇచ్చిన విత్తనాలు సక్రమంగా మొలక రాకున్నా, దిగుబడి రాకున్నా ప్రశ్నించేందుకు అవకాశంలేదు. రైతులు స్వర్ణరకం కొంతమేర సాగుచేస్తారు. ఆ రకం విత్తనాలు అందుబాటులో లేవని, సంపత్ స్వర్ణరకం విత్తనాలను గతేడాది రైతులకు అంటగట్టారు. ప్రైవేటు వ్యాపారులు నాణ్యమైన వరివిత్తనాలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రేపటి నుంచి అభయాంజనేయ స్వామి ఉత్సవాలు ప్రారంభం 8లో

యమలోకానికి బైపాస్?

- మృత్యు మార్గంగా ఎన్‌హెచ్ 16 • అధ్వాన నిర్వహణతో ప్రమాదాలు 8లో



ప్రమాదాలకు కారణమవుతున్న హనుమాన్ జంక్షన్‌లోని జాతీయ రహదారి

వంశీకి జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు 6లో

మల్లవల్లి పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలకు కృషి 8లో

కొత్తగా నోటీసులు ఇచ్చేందుకు అనుమతించండి

- మచిలీపట్నంలో వైసీపీ భవనం కూల్చివేతపై హైకోర్టును కోరిన మున్సిపల్ కమిషనర్ • అంగీకరించిన న్యాయమూర్తి

అమరావతి, మే 15(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని వైసీపీ కార్యాలయం కూల్చివేతకు మున్సిపల్ కమిషన్ ఇచ్చిన తుది ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. కార్పోరేషన్ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ వాదనలు వినిపిస్తూ.. భవనం కూల్చివేతకు ఇచ్చిన తుది ఉత్తర్వులతో పాటు ప్రొవిజనల్ నోటీసును ఉపసంహరించుకుంటున్నామని కోర్టుకు వివరించారు. తాజాగా నోటీసులు ఇచ్చేందుకు వెసులుబాటు ఇవ్వాలని కోరారు. అందుకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ అంగీకరించారు. వ్యాజ్యాన్ని పరిష్కరించారు. వైసీపీ కార్యాలయం కూల్చివేతకు మున్సిపల్ కమిషనర్ మే 9న ఇచ్చిన తుది ఉత్తర్వులను పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని హైకోర్టులో సవాల్ చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ అన్ని అనుమతుల తరువాతే భవన నిర్మాణం చేపట్టామని, తుదిదశకు చేరుకుందని వివరించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పాటించేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

స్థానిక సమరానికి సన్నద్ధమయ్యేలా..

» 18 నుంచి ఉమ్మడి కృష్ణాలో మినీ మహానాడుకు సన్నాహాలు

» మూడు రోజులు అసెంబ్లీల పరిధిలో..

» 22, 23 తేదీల్లో జిల్లాస్థాయిలో నిర్వహణ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మినీ మహానాడు కార్యక్రమాలకు ఉమ్మడి కృష్ణా జిల్లాలు సమాయత్తమయ్యాయి. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పార్టీ రథసారథులైన నెట్టెం రఘురామ్, కొణకళ్ల నారాయణలు మినీ మహానాడు ఏర్పాట్లపై తలమునకలయ్యారు. జిల్లా అధ్యక్షులుగా నియమితులైన తర్వాత తొలిసారిగా జరుగుతున్న మహానాడు కావటంతో ఇరువురూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. రెండు జిల్లాల్లో కార్యకర్తలను పెద్ద ఎత్తున సమీకరించి ముందుగా నియోజకవర్గ స్థాయిలో, చివరగా జిల్లా స్థాయిలో మినీ మహానాడులను నిర్వహించి రాష్ట్రస్థాయి కార్యక్రమానికి సన్నద్ధం కావాలని భావిస్తున్నారు. రెండు జిల్లాల నుంచి భాగస్వామ్యం కావాల్సిన అంశాలపై మినీ మహానాడు కార్యక్రమాలలో చర్చించనున్నారు.

మినీ మహానాడు సమావేశాలలో తొలిభాగంలో పార్టీ ఎలాంటి పరిస్థితుల్లో ఆవిర్భవించింది? రాష్ట్రంలో, దేశంలో సాధించిన విజయాలు.. ఎదుర్కొన్న సంక్షోభాలు, ఆటుపోట్లు.. తిరిగి ఏ విధంగా శక్తిని పుంజుకున్నది.. అన్న విషయాలపై సీనియర్ నేతలు ప్రసంగిస్తారు. రెండో భాగంలో కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు.. ఫలితాలు.. ఇతర రాజకీయ పార్టీల దాడులను పార్టీశ్రేణులు తిప్పికొట్టి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఏ విధంగా సన్నద్ధం కావాలన్న అంశాలపై నేతలు ప్రసంగిస్తారు. అంతిమంగా రాష్ట్ర మహానాడు కార్యక్రమం విజయవంతంపై కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

18 నుంచి మినీ మహానాడు కార్యక్రమాలు

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఈనెల 18 నుంచి 20 వరకు నియోజకవర్గ స్థాయిలో మినీ మహానాడు కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. 22, 23 తేదీల్లో జిల్లా స్థాయి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ మేరకు రెండు జిల్లాల పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్, కొణకళ్ల నారాయణలు పార్టీ నాయకత్వాలకు దిశా నిర్దేశం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ ఈస్ట్, సెంట్రల్, పశ్చిమ, జగ్గయ్యపేట, నదిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో మినీ మహానాడు కార్యక్రమాలు నియోజకవర్గ అధ్యక్షుల పర్యవేక్షణలో జరుగుతాయి. అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, మంత్రులు, గ్రామ, మండల, నియోజకవర్గ నేతలు, అనుబంధసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారు. జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు.

ఎన్టీఆర్ జిల్లాస్థాయి మినీ మహానాడును మే 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇంకా తేదీపై స్పష్టత రాలేదు. కృష్ణాజిల్లాలో ఈనెల 18, 19, 20 తేదీల్లో నియోజకవర్గ కార్యక్రమాలను నిర్వహించేందుకు జిల్లా అధ్యక్షుడు కొణకళ్ల నారాయణ నిర్ణయించారు. 18న అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల పరిధిలో కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మిగిలిన వాటిపై స్పష్టత రావాల్సి ఉంది. కృష్ణా జిల్లా స్థాయి మినీ మహానాడు మే 23న మచిలీపట్నం సత్య కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నట్టు, జిల్లాలోని ఎమ్మెల్యేలు, వివిధ మండల కమిటీల ప్రతినిధులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కొణకళ్ల అధ్యక్షత వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, మంత్రి కొల్లు రవీంద్రలతో సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయనున్నట్టు కొణకళ్ల 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. మినీ మహానాడుకు ప్రత్యేక, విశిష్ట అతిథులుగా ఎవరిని పిలవాలన్నదానిపై కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి

» వత్సవాయిలో ఘటన

వత్సవాయి, మే 15 (ఆంధ్రజ్యోతి) : బ్యాంక్‌కు వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా ప్రమాద వశాత్తు సిమెంట్ ట్యాంకర్ కిందపడి నిండు గర్భిణి మృతి చెందిన ఘటన వత్సవాయిలో జరిగింది. పోలంపల్లి గ్రామానికి చెందిన రంగా సతీష్, రాజేశ్వరి దంపతులకు రెండేళ్ల బాబు ఉన్నాడు. ప్రస్తుతం రాజేశ్వరి (22) ఏడుమాసాల గర్భిణి. మామ రంగా రమేష్‌తో కలిసి ఆమె ద్విచక్రవాహనంపై గురువారం బ్యాంక్‌కు వెళ్లి పని ముగించుకొని తిరిగి పోలంపల్లి వస్తుండగా వత్సవాయి సమీపంలో ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్‌ను తప్పించే క్రమంలో రాజేశ్వరి ట్యాంకర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇరుకుదారిలో తరచూ ప్రమాదాలు

లింగాల కాజ్‌వేకి మరమ్మతులు చేపట్టడంతో ట్రాఫిక్‌ను మక్కపేట మీదుగా పెనుగంచిప్రోలు, వేమవరం, వత్సవాయి మీదుగా ప్రధాన రహదారికి చేరుకునే విధంగా మళ్లించారు. రహదారి ఇరుకుగా మారడంతో వాహనాలు తప్పుకునే వీలు లేకుండా పోయింది. దారి మొత్తం మూసుకుపోయి రహదారిపై ఇసుక పోయడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు కాజ్‌వే వద్ద డైవర్షన్ రహదారి ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



హోంమంత్రికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనా నాయక్

కనకదుర్గమ్మ సేవలో హోంమంత్రి అనిత

ఇంద్రకీలాద్రి, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను రాష్ట్ర హోంమంత్రి అనిత కుటుంబసభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈవో వీకే శీనా నాయక్ ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వారికి వేదపండితుల ఆశీస్సులు, ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

అమరావతిలో నాక్ ఏర్పాటుకు కృషి

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణ రంగంలో నాణ్యత, నిపుణత సాధించిన భవన నిర్మాణ కార్మికులతో పాటు అవసరమైన సిబ్బంది అమరావతి నిర్మాణానికి అవసరమని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ మాదాపూర్‌లోని జాతీయ నిర్మాణ అకాడమీ (నాక్)ను గురువారం ఆయన సందర్శించారు. ఎంపీతో పాటు ఏపీ బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ సలహా



కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు తదితరులు నాక్ సంస్థ పనితీరును పరిశీలించారు. అక్కడ ఇంజనీరింగ్ విద్యార్థులు, నిరుద్యోగులు, భవన నిర్మాణ కార్మికుల కోసం నైపుణ్యాభివృద్ధి సంస్థలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలను ట్రైనింగ్ డైరెక్టర్ శాంతిశ్రీ ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ.. అమరావతిలో జాతీయ నిర్మాణ అకాడమీ ఏర్పాటు చేయాలనే ఆలోచన చంద్రబాబుకు ఉందన్నారు. అమరావతి రాజధాని పనులు రూ.60వేలకోట్ల అంచనాతో ప్రారంభమయ్యాయని, ఇందుకు ఎంతో మంది సివిల్ ఇంజనీర్లు, సివిల్ వర్కర్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల అవసరం ఉందన్నారు. నాక్‌లో శిక్షణ తీసుకుని నైపుణ్యం పొందిన వర్కర్లు ఉంటే అద్భుతమైన రాజధాని తయారవుతుందని ఆయన చెప్పారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో పదో తరగతి, ఇంటర్, అంతకంటే తక్కువ చదువుకే పరిమితమైన యువతకు ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ఇటువంటి వారికి ఊతంగా ఉండేందుకే అమరావతిలో నాక్ ఏర్పాటుకు కృషి జరుగుతోందన్నారు. ఇందుకు తగిన సహకారం ఇవ్వాలని ఆయన అక్కడి అధికారులను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ నాక్ సీటీటీఐ ఎం.రాజారెడ్డి, రీజనల్ డైరెక్టర్ పి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్‌లో సత్తాచాటిన ఉమ్మడి కృష్ణా విద్యార్థులు

మచిలీపట్నం/విజయవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 6న నిర్వహించిన ఏపీఈసెట్-2025పరీక్షల్లో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల విద్యార్థినీ విద్యార్థులు సత్తా చాటారు. కృష్ణా జిల్లాలో మొత్తం 1013 మంది దరఖాస్తు చేసుకోగా 1000 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 958 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 95.80 నమోదైంది. అదే విధంగా ఎన్టీఆర్ జిల్లా నుంచి 3123 మంది దరఖాస్తు చేసుకోగా 3045 మంది పరీక్షకు హాజరయ్యారు. 2489 మంది ఉత్తీర్ణత సాధించి 93.56 శాతం నమోదు చేశారు.



అచీవర్స్‌డే కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

కేయూలో విస్తృత ఉద్యోగావకాశాలు

» మంత్రి కొల్లు రవీంద్ర ప్రశంస

మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : కృష్ణావిశ్వవిద్యాలయం ఫార్మసీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు నూరుశాతం ఉద్యోగావకాశాలు కల్పించడం అభినందనీయమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం విశ్వవిద్యాలయంలో తొలిసారి ఏర్పాటు చేసిన అచివర్స్‌డే కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలకోర్చి పిల్లలను చదివిస్తారని, చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగం సాధిస్తే వారు గర్వపడేలా చేసినవారవుతారన్నారు. రూ. 45 కోట్లతో విశ్వవిద్యాలయంలో సౌకర్యాల కల్పన లక్ష్యంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. పల్లెతుమ్మలపాలెం గ్రామంలో మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించామన్నారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ, ప్రైవేట్ రంగంలో విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయని, సంవత్సరాల తరబడి ఒకే ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.రాంజీ మాట్లాడుతూ, ప్రాంగణ ఎంపికల్లో ఏడాదికి రూ.9 లక్షల ప్యాకేజీతో ఎంపికవడం ఇక్కడి అధ్యాపకుల పనితీరుకు నిదర్శనమన్నారు. అనంతరం విద్యార్థులను, తల్లిదండ్రులను మంత్రి ఘనంగా సత్కరించారు. రిజిస్ట్రార్ ఎన్.ఉష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొనకళ్ల బుల్లయ్య, నెక్స్ట్ హబ్ టెక్నాలజీస్ కంపెనీ సీఈవో సాయికృష్ణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంశీకి జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు

విజయవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ జిల్లా జైల్లో ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు జైలు అధికారులు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. మూడు రోజుల క్రితం రిమాండ్ పొడిగింపు నిమిత్తం ఏసీబీ కోర్టుకు హాజరైనప్పుడు అనారోగ్య సమస్యల గురించి న్యాయాధికారికి విన్నవించుకున్నారు. దీంతో ఆయనకు చికిత్స చేయించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. బుధవారం ప్రభుత్వాసుపత్రిలోని ఆర్‌ఎంవో గదిలో కొన్ని వైద్య పరీక్షలు చేశారు. గురువారం పల్మనాలజీ, న్యూరోకు సంబంధించిన పరీక్షలు చేశారు. వాటితోపాటు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. అరగంటపాటు ఆయనను వైద్యుల బృందం పరీక్షించింది. అనంతరం జైలుకు తరలించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రతిభ చాటారు

» మంత్రి సవిత అభినందన

» బీసీ విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థినికి నగదు పురస్కారం అందజేస్తున్న మంత్రి సవిత

వన్‌టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థుల విద్యకు బలమైన పునాదులు వేయటం వల్లే పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం ఏర్పాటు చేసిన పది, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన బీసీ హాస్టల్స్, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించి వారిలో స్ఫూర్తి నింపేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష అన్నారు. బీసీ సంక్షేమ వసతి గృహాలలో మరమ్మతులు, తదితర మౌలిక ఏర్పాట్లు చేశామన్నారు. బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. రాష్ట్రంలో మరిన్ని బీసీ గురుకులాలను నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అన్ని హాస్టల్స్‌లో ఏపీఎఫ్‌ఆర్ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు తీసుకుని భోజనం అందిస్తున్నామన్నారు. బీసీ యువతకు సివిల్ సర్వీసు శిక్షణతో పాటు మెగా డీఎస్సీకి శిక్షణ అందిస్తున్నామన్నారు. విదేశీ విద్యకు కూడా శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. పాఠశాలలు తెరచిన వెంటనే రాష్ట్రంలో అన్ని బీసీ హాస్టల్స్‌కు సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. విద్యాదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన రాష్ట్రానికి చెందిన వీర జవాన్ మురళీ నాయక్ త్యాగాలను అందరూ గుర్తుంచుకోవాలన్నారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ, ఏ విద్యార్థి అయినా నిరంతరం శ్రమిస్తేనే ఉన్నతంగా జీవితంలో స్థిరపడతాడన్నారు. అడిషనల్ డైరెక్టర్ బి.చంద్రశేఖర్‌రాజు మాట్లాడుతూ, విద్యార్థులు ఇదే ప్రతిభను నిరంతరం కొనసాగించాలని సూచించారు. అనంతరం 200 మంది విద్యార్థులకు బ్యాగ్‌లు, సర్టిఫికెట్‌లు, మెమెంటోలు.. 12మందికి రూ.20వేలు, ఏడుగురికి రూ.15వేలు, ముగ్గురుకి రూ.10వేలు చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి, అధికారులు భోజనం చేశారు. తొలుత జ్యోతిరావు పూలే విగ్రహానికి, వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకులు ఎ.మల్లికార్జున్, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులాల సొసైటీ కార్యదర్శి పి.మాధవీలత, ఎ.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఎడ్ల బండ లాగుడు పోటీలు

నందిగామ రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి) : లింగాలపాడు గ్రామంలో తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. గురువారం న్యూ కేటగిరి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలలో ఎనిమిది జతలు పాల్గొన్నగా 20 నిముషాల వ్యవధిలో 14.50 క్వింటాళ్ల బండ లాగినట్లు రైతు కమిటీ సభ్యులు తెలిపారు. ఎడ్ల యజమానులకు అంబారుపేట సత్యమ్మ అమ్మవారి మాజీ చైర్మన్ గరికపాటి భాస్కరం సోదరులు వస్త్రాలు, జ్ఞాపికలు అందజేశారు. పోటీలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఆరు పళ్ల విభాగం విజేతలు

బుధవారం రాత్రి జరిగిన ఆరు పళ్ల జతల విభాగంలో పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన శ్రీకావ్య నంది బ్రీడింగ్ బుల్స్ నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 3,911.08 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ. 40వేలు గెలుచుకుంది. అదే విధంగా కృష్ణాజిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన ఏఎస్ఆర్ మెమోరియల్ అనంతనేని శ్రీకావ్య శ్రీమధు ఎడ్ల జత ద్వితీయ స్థానంలో నిలిచి రూ.35 వేలు, బాపట్ల జిల్లా మంగళూరు మండలం పంగళూరు గ్రామానికి చెందిన గొట్టిపాటి రవికుమార్ యూత్ చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్ల జత తృతీయ స్థానంలో నిలిచి రూ. 25వేలను గెలుచుకుందన్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామానికి చెందిన గాదే అశేర్ సమన్వీ రెడ్డి ఎడ్లజత నాలుగవ స్థానంలో నిలిచి రూ.20 వేలను గెలుచుకున్నాయి.



బండ లాగుతున్న ఎడ్లజత



విజేతకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఇక విత్తన కష్టాలు!

(5వ పేజీ తరువాయి)

విత్తనాలు ఉంటాయి. సర్టిఫైడ్ విత్తనాలయితే రైతులకు క్వింటాకు అసలు ధర కన్నా రూ200 అధికంగా ధరను పెంచి విక్రయిస్తారు. విత్తనాల సంచిపై లేబుల్ ఉంటుంది. నాన్ సర్టిఫైడ్ విత్తనాలను కొంత మేర ధర తగ్గించి విక్రయిస్తారు. ఇందులో మొలకశాతం తక్కువగా ఉంటుంది. గత ఖరీఫ్ సీజన్‌లో ఉత్పత్తి చేసిన పాత విత్తనాల్లో 70 శాతం మాత్రమే మొలక ఉంది. ఈ ఏడాది రబీ సీజన్‌లో ఉత్పత్తి చేసిన వరి విత్తనాల్లో 80 నుంచి 90శాతం మొలక ఉంది. పాత విత్తనం అయితే పంట చేతికొచ్చే సమయంలో పైరు మొదలు కొంత మేర దృఢంగా ఉండి నేలవాలిపోకుండా ఉంటుందని, కొత్తవిత్తనం అయితే పంట కోత దశకు ముందు నేలవాలిపోయే గుణం అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. గత సీజన్‌లో ధాన్యం పాలుపోసుకునే దశ నుంచి కోత కోసే వరకు ఉన్న వాతావరణ పరిస్థితులను బట్టి కూడా విత్తనాలలో మొలకశాతం ఆధారపడి ఉంటుందని రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

వరి విత్తనాల పంపిణీ ఇలా..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఎన్ని క్వింటాళ్ల వరి విత్తనాలు సబ్సిడీపై అందించాలనే అంశంపై వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. బీపీటీ-5204 రకం విత్తనాలు 2,600 క్వింటాళ్లు, ఎంటీయూ 1061రకం విత్తనాలు 2,600క్వింటాళ్లు, ఎంటీయూ 1224 రకం విత్తనాలు 600 క్వింటాళ్లు, ఎంటీయూ 1318 రకం విత్తనాలు 5,200 క్వింటాళ్లు, ఎంటీయూ 1262 రకం విత్తనాలు 600 క్వింటాళ్లు రైతులకు సబ్సిడీపై ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

చిన్న, సన్నకారు రైతులకు విత్తనాలు అందేనా?

రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందించేందుకు ఆంక్షలను విధిస్తున్నారు. రైతులు ఆర్ఎస్‌కేలకు పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డులను తీసుకువెళ్లి పేర్లు ముందుగానే నమోదు చేయించుకోవాలి. ఎంత మేర విత్తనాలు కావాలో తెలియజేస్తూ వివరాలు అందజేయాలని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. రైతుల నుంచి వచ్చిన ఇండెంట్‌ను బట్టి అప్పుడు ఏపీసీడ్స్‌కు ఇండెంట్ పెడతామని అంటున్నారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయాల వద్దకు వరి విత్తనాలు వచ్చినా పెద్ద రైతులు లేదా వ్యాపారుల చేతుల్లోకే విత్తనాలు గుట్టు చప్పుడు కాకుండా చేరడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. రెండు, మూడు ఎకరాల భూమిని సాగు చేసే రైతులు వరి విత్తనాల కోసం వ్యవసాయశాఖ కార్యాలయాలకు వెళితే స్టాక్ లేదని, మళ్లీ వస్తాయని అప్పుడు కబురు చేస్తామని చెప్పి పంపేయడం అలవాటుగా మారింది. వేరుశెనగ విత్తనాలను కడప, అనంతపురం జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాలి. ఈ విత్తనాలను ఈ ఏడాది సబ్సిడీపై ఇచ్చే అంశంపై ఇంకా స్పష్టతలేదు.

మట్టి దందా!

(5వ పేజీ తరువాయి)

తవ్వమన్నారని వీఆర్వో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఏమీ మతలబు జరిగిందో గాని పట్టుకున్న రెండు మట్టిలోడు లారీలను, ఎక్స్‌కవేటర్‌ను విడిచిపెట్టాశారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా మట్టితవ్వకాలకు అనుమతులు లేవన్నారు. తవ్వకాలను నిలిపివేశామని చెప్పారు. లారీల్లో మట్టిని ఖాళీ చేయించి పంపించేశామన్నారు. కాగా, అధికారుల చర్యపై తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. మండలంలో అనేక చోట్ల అక్రమంగా ఇసుక, మట్టి తవ్వకాలను ఇలాగే ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

● మార్చి 19న సైబరాబాద్ పోలీసులు పెద్దఎత్తున నిషేధిత బీటీ-3 పత్తి విత్తనాలను పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు లారీలో తీసుకువస్తున్న రూ.98.75 లక్షల విలువైన 3,750కిలోల బీటీ-3 విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.

● ఏప్రిల్ 12న వికారాబాద్ జిల్లా పోలీసులు, గుంటూరు నుంచి తరలిస్తున్న 44 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు.

..పంట భూముల్లో దుక్కులు దున్నింది మొదలు పంట చేతికి వచ్చేంతవరకు రైతులు ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఆశాజనకమైన పంట దిగుబడులు రావాలంటే ఎరువులు, పురుగుమందులతో పాటుగా విత్తనాల కొనుగోళ్లలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే నామమాత్రపు దిగుబడులు కూడా లేక, పెట్టుబడులు తిరిగి చేతికి అందక నష్టాలను మూటగట్టుకోవాల్సిన ప్రమాదం ఉంది. గతంలో అక్రమార్కుల వలలో చిక్కుకుని అమాయకత్వంతో నకిలీ విత్తనాలు, నాసిరకం విత్తనాలు సాగుచేసి, రోడ్డున పడిన అన్నదాతల కుటుంబాలకు కొదవలేదు. అక్రమ సంపాదన కోసం అన్నదాతలను నట్టేట ముంచుతున్న అక్రమార్కులపై పాలకులు, అధికారులు తగిన చర్యలు తీసుకోలేకపోవటమే కాకుండా బాధితులకు సకాలంలో తగిన న్యాయం లభించటం లేదు.

ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న వేళ..

కొద్దిరోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నది. ఇప్పటికే అకాల వర్షాలు పడుతుండటంతో పలువురు రైతులు చెత్తా చెదారం తొలగించి పంట భూములను బాగుచేశారు. రుతుపవనాలు రాగానే భూములు పదును అయిన వెంటనే విత్తనాలు వేసేందుకు రైతులు భూములను సిద్ధం చేస్తున్నారు. అయితే విత్తనాల బెడద రైతులకు పెనుసవాల్‌గా మారుతున్నది. ఏది మంచిదో, ఏది నకిలీదో అర్థంకాని విధంగా విత్తనాల ప్యాకెట్స్ ఉంటున్నాయి. గతంలో జరిగిన సంఘటనల దృష్టిలో పెట్టుకుని పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న, పెసర తదితర పంటల విత్తనాలు కొనేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ప్రభుత్వ అనుమతులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి. ఎట్టి పరిస్థితుల్లో కూడా అనుమతుల్లేని దుకాణాల్లో, అనధికార వ్యక్తుల వద్ద కొనగూడదు. కొన్న విత్తనాలకు సంబంధించి రశీదు (బిల్లు) దుకాణదారుడు నుంచి తీసుకోవాలి. ఈ బిల్లును పంట దిగుబడి వచ్చేంతవరకు, పంట కాలం పూర్తి అయ్యేంత వరకు భద్రపరుచుకోవాలి. విత్తనాలు నకిలీవి అని తేలితే సదరు విత్తన ఉత్పత్తిదారుడి నుంచి తగిన నష్టపరిహారం పొందేందుకు ఈ రశీదు చాలా ముఖ్యం. ఈ రశీదుపై విత్తన రకం, కంపెనీ పేరు, బ్యాచ్, లాట్ నెంబర్లు, ధర తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. రశీదుపై విత్తనాలు అమ్మిన దుకాణం ముద్ర ఉండేలా చూసుకోవాలి. విత్తన ప్యాకెట్ తయారైన తేదీ (డీఓపీ), పరీక్షించిన తేదీ (డీఓటీ), గడువు తేదీ సరిగా ఉన్నాయో లేవో సరిచూసుకోవాలి. విత్తన సంచులు చిరిగినా, రంధ్రాలు ఉన్న, తడిసిన కొనుగోలు చేయవద్దు. విత్తన ప్యాకెట్లు నిల్వ ఉంచినప్పుడు తేమ శాతం కూడా చూసుకోవాలి.

అక్రమార్కుల వలలో పడొద్దు..

గ్రామాల్లో తిరుగుతూ విత్తనాలు అమ్మే వారివద్ద కొనుగోలు చేయకూడదు. కొంతమంది అక్రమార్కులు, గ్రామాల్లో పెద్దలను ఆకట్టుకుని, నకిలీ విత్తనాలను బ్రాండెడ్ కంపెనీలవని చెపుతూ, అందమైన ప్యాకెట్లలో నింపి అమ్ముతుంటారు. ధర చాలా తక్కువంటూ ఇంకొందరు విత్తనాలను లూజుగా అమ్ముతుంటారు. తక్కువ ధరకు లభిస్తున్నాయని ఆశపడి ఎట్టిపరిస్థితుల్లో కూడా అనుమతి లేని విత్తనాలు కొనవద్దు. ముఖ్యంగా నాణ్యమైన మిర్చి విత్తనాల ధర కిలో వేలల్లో ఉంటుంది. కొంత మంది లూజుగా విత్తనాలు తీసుకవచ్చి నాణ్యమైన విత్తనాలంటూ తక్కువ ధరకు అమ్ముతుంటారు. వీరిపట్ల జాగ్రత్తగా ఉండటమే కాకుండా, అట్టి వారి గురించి వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలి.

నిషేధిత విత్తనాలకు దూరంగా ఉండాలి

పత్తికి సంబంధించి బీటీ-3 విత్తనాలు కొనగూడదు.. సాగుచేయకూడదు. పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించటంతో బీటీ-3 పత్తి విత్తనాలకు కేంద్ర ప్రభుత్వ అనుమతి ఇవ్వలేదు. ఈ విత్తనాలు నిషేధం. అయినప్పటికీ పలుచోట్ల అనధికార వ్యక్తులు బీటీ-3 విత్తనాలు గుట్టుగా అమ్ముతున్నారు. అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో జిల్లాలో అక్కడక్కడ రైతులు సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలను కొనవద్దని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలి

ఉంగుటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా పెండింగ్‌లో వున్న నీటి తీరువా (తాశీలు) వసూళ్లు వేగవంతం చేయాలని తహసీల్దార్ జాలాది విమలకుమారి అన్నారు. రైతులనుంచి వసూలు కావాల్సిన నీటి తీరువా బకాయిలపై గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో వీఆర్వోలు, వీఆర్యేలకు పలు సూచనలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో 1.50కోట్ల మేర బకాయిలుండగా, వాటిలో 13లక్షలు మాత్రమే వసూలవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చేనెల నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమౌతున్న నేపథ్యంలో వసూళ్ల ప్రక్రియపై రెవెన్యూ సిబ్బంది దృష్టిసారించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ యు.కిషోర్‌కుమార్, ఆర్ఐ. బి.సూర్యకాంతి, కార్యాలయ సిబ్బంది, వీఆర్వో, వీఆర్యేలు పాల్గొన్నారు.

సైడ్ డ్రెవిన్

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో ఏళ్లనాటి సమస్యకు చెక్
- నిడమానూరులో రూ.30లక్షలతో సైడ్ డ్రెయిన్ పనులు
- గ్రామస్థులకు తప్పనున్న దోమల బెడద

(ప్రసాదంపాడు - ఆంధ్రజ్యోతి)

నిడమానూరులోని ఏళ్లనాటి సమస్య తీరనుంది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో రూ.30 లక్షలతో సైడ్ డ్రెయిన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సాయిబాబా ఆలయం నుంచి జిల్లా



నిర్మించిన సైడ్ డ్రెయిన్

పరిషత్ ఉన్నత పాఠశాల వరకు సైడ్ డ్రెయిన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.20 లక్షలు, జనరల్ ఫండ్స్ నుంచి మరో రూ.10 లక్షలతో సైడ్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే యార్లగడ్డకు గ్రామంలోని ప్రధాన సమస్యను గ్రామస్తులు వివరించారు. అధికారంలోకి వచ్చిన 11 నెలల్లో ఆ సమస్యపై దృష్టి పెట్టి తీరుస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ కాలువ నిర్మాణం వల్ల వృథా నీటిని రైవస్ కాలువలోకి తరలించవచ్చు. గతంలో వర్షాకాల సమయంలో రైవస్ కాలువ నీరు గ్రామంలోకి వచ్చేదని స్థానికులు చెబుతున్నారు. కాలువ ఉధృతి తగ్గిన తర్వాత గ్రామంలోని వృథా నీరు రైవస్ కాలువకు వెళ్లేదని చెబుతున్నారు. దీని వల్ల దోమలు బెడద వీపరితంగా ఉండడంతో పాటు ఆరోగ్య సమస్యలతో సతమతమయ్యేవారమని చెబుతున్నారు. డ్రెయిన్



ముమ్మరంగా సాగుతున్న పనులు

నిర్మాణం పూర్తయితే చెరువు నీటిని రైవస్ కాలువకు విడుదల చేయవచ్చని ఈవో నరసింహారావు తెలిపారు. మే చివరి నాటికి పనులు దాదాపు పూర్తవుతాయని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, గ్రామస్తుల సహకారంతో పనులు త్వరితగతిన సాగుతున్నాయని వెల్లడించారు.



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది

అక్రమ నిర్మాణాల తొలగింపు

పెనమలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : కానూరు, తాడిగడపల్లో అక్రమంగా నిర్మిస్తున్న అనధికార కట్టడాలను మునిసిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది గురువారం తొలిగించారు. మునిసిపాలిటీ పరిధిలో అనధికార కట్టడాలను ఉపేక్షించేది లేదని, బిల్డర్లు ఈ విషయంలో సహకరించాలని, లేనిపక్షంలో బ్లాకులిస్టులో పెడతామని కమీషనరు భవానీ ప్రసాద్ హెచ్చరించారు.



జబర్లపూడి గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్

భూ విస్తీర్ణంలో అభ్యంతరాలపై అప్పీల్

ఉయ్యూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : జబర్లపూడి గ్రామపరిధిలో రీసర్వే పూర్తయి తుది జాబితా (రికార్డ్‌ఆఫ్ రైట్స్) సిద్ధమైనందున కొత్తగా రైతులకు కేటాయించిన ఎల్‌పీఎమ్ నంబర్లు, వారి పేరుతో ఉన్న భూమి విస్తీర్ణంలో అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకునే అవకాశముందని తహసీల్దార్ ఎమ్. సురేశ్‌కుమార్ అన్నారు. జబర్ల పూడిలో గురువారం నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. సర్పంచ్ శేషవరప్రసాద్, సర్వేయర్ సురేశ్ పాల్గొన్నారు.



ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

వేణుగోపాలస్వామి ఆలయంలో మహా సంప్రోక్షణ

విజయవాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : లోక కల్యాణార్థం నున్న లోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో గురు వారం మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దేవదాయ శాఖ, గ్రామస్తుల సంయుక్త ఆధ్వ ర్యంలో ఉదయం అష్టబంధన, మహా సంప్రో క్షణ, కుంభాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం భక్తులు గ్రామ పుర వీధుల్లో కోలాటాలు, నృత్యాలు, మంగళ వాయిద్యాలతో శోభయాత్రను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు రొం పిచర్ల అప్పలాచార్యులు, పండితులు శేషా చార్యులు, దత్తకుమార్, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బాబాకు ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ : స్థానిక బాపులపాడు బాబా మందిరంలో బాబాకు ప్రీతి కరమైన గురు వారం పురస్క రించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. మందిరం అభివృద్ధి కమిటీ చైర్మన్ కొల్లి వెంకట్రావు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిపారు.

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

మంత్రి మనోహర్‌కు కాగిత కొండ వినతి



పెనమలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాగిత కొండ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం కానూరు పౌరసరఫరా శాఖ కార్యాలయంలో మంత్రిని కలిసిన కాగిత కొండ పలు సమస్యలను మంత్రికి నివేదించారు. రేషన్ డీలర్లకు వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేసి చనిపోయిన డీలర్ కుటుంబానికి ప్రభుత్వం ఐదు లక్షల ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఆహార భద్రతా చట్టంలో లేని ఎండీయూ వ్యవస్థను రద్దుచేసి పాత పద్ధతిలోనే రేషన్ సరఫరా చేసేట్లు డీలర్లకు అవకాశం ఇవ్వాలని కోరారు. డీలర్ల సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి డీలర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఎన్టీఆర్ జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు తాటి రామారావు ఉన్నారు.

వడదెబ్బకు గురికాకుండా అవగాహన కల్పించాలి

ఉయ్యూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో వేసవి గాలుల బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. కడవకొల్లు గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం మండలస్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మూడవ శనివారం నిర్వహించనున్న బీట్ ద హీట్ వేసవి గాలుల బారిన పడకుండా ప్రజలకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. గండిగుంట సీహెచ్‌సీలో 5 పడకలు ప్రత్యేకంగా వడగాల్పుల బాధితుల కోసం ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఉంగుటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తేలప్రోలు టీడీపీ గ్రామ యువ నాయకులు పేర్కొన్నారు. క్రికెట్ ఆట పట్ల ఆసక్తివున్న పేద క్రీడాకారులను ప్రోత్సహించే నిమిత్తం స్థానిక టీడీపీ యువ నాయకులంతా కలిసి వితరణగా అందజేసిన సొమ్ముతో కొనుగోలుచేసిన క్రికెట్ బ్యాట్స్, బాల్స్‌ను గురువారం క్రికెట్ క్రీడాకారుల జట్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువనాయకులు జి. సందీప్, రాజబోయిన శివాజీ, నిమ్మకూరి మహేష్, స్థానిక యువ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులను అందించడమే లక్ష్యం



ఉత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రసాదంపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణతో కూడిన విద్యాబోధనతో దేశాభివృద్ధికి అవసరమైన ఉత్తమ పౌరులను అందించడమే లక్ష్యంగా విజ్ఞాన విహార ఎడ్యుకేషనల్ సొసైటీ కృషి చేస్తుందని సొసైటీ అధ్యక్షులు బి.వి.ఎస్.టి సాయి అన్నారు. గురువారం ఎనికేపాడు విజ్ఞాన విహార ఆంగ్ల మాధ్యమ పాఠశాల్లో ఇటీవల విడుదలైన సీబీఎస్ ఈ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదవ తరగతి తర్వాత విద్యార్థులు ఎంచుకునే లక్ష్యాలు ఉపాధి, ఆర్థిక అభివృద్ధి సమాజానికి తన వంతు సేవలందించేలా మంచి కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అందరూ వెళుతున్న దారిలో కాకుండా మీ సొంత ఆలోచనలతో, ప్రత్యేకమైన మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి ఇదే పాఠశాలకు గౌరవ అతిథులుగా రావాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.శైలజ, ఉప ప్రధానోపాధ్యాయులు జి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన

పెనమలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : కానూరు మాణిక్య నగర్ నాల్గవ లైన్‌లో ఐదులక్షల సాధారణ నిధుల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు, డ్రైన్‌లకు స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్‌బుజ్జి, దోనేపూడి రవికిరణ్, యేకుల విజయేంద్ర, మల్లోలు ప్రసాద్, ఈఈ భూషణం, అసిస్టెంట్ కమిషనర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



వీరవల్లి, నిడమానూరుల్లో పశువుల దాణా పంపిణీ

పాడి పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : పోషకాలతో కూడిన దాణాను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ ఏడీ శ్రావణ్‌కుమార్ సూచించారు. వీరవల్లి, అంపాపురం, బండారుగూడెం తిప్పనగుంట, సిరివాడకు చెందిన పాడి రైతులకు 50శాతం సబ్సిడీపై పశువుల దాణాను గురువారం అందజేశారు.

ప్రసాదంపాడు : పశుదాణాను 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నామని పశుసంవర్ధశాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు అన్నారు. గురువారం నిడమానూరు పశు వైద్యశాలలో పశుదాణా పంపిణీని ఆయన ప్రారంభించారు.

మూగజీవిపై కనికరం లేదాయె!

బతికుండగానే కుక్కను బైక్‌కు కట్టి రోడ్డుపై ఈడ్చుకెళ్లిన యువకులు



విజయవాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : నున్నలో కొందరు గుర్తుతెలి యని వ్యక్తులు వీధికుక్కపై మూగజీవం అని కూడా చూడకుండా తాళ్లతో మోటార్ సైకిల్‌కు కట్టి ఈడ్చుకు వెళ్లారు. ఈ అమానుషం ఘటనలో వీధి కుక్క మృతి చెందింది. గురువారం నున్నలోని ప్రధాన రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. మధ్యాహ్నం ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనం వెనుక బతికున్న కుక్కను కట్టి రోడ్డుపై ఈడ్చుకు వెళ్లారు. వారికి స్థానికులు, వాహనదారులు చీవాట్లు పెట్టారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉయ్యూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల గ్రామాల సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం నుంచి గ్రామాల వారిగా నిర్దేశించిన సమయాల్లో ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్‌లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీ సీఎల్ ఈఈ డి.కృష్ణ నాయక్ తెలిపారు. గండిగుంటలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు, పెద ఓగిరాల, కాటూరు, నందమూరు సబ్‌స్టేషన్ల పరిధిలో 1 నుంచి 2 గంటల వరకు ఉయ్యూరు సబ్‌స్టేషన్ల పరిధిలో 2 నుంచి 3 గంటల వరకు ఫీడర్లకు కరెంట్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు. నున్న నుంచి గుడివాడ 220 కేవీ ట్రాన్స్మిషన్ లైన్ ఆధునీకరణ పనులు పూర్తయ్యేవరకు ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ విధిస్తున్నట్లు తెలిపారు.

పెంచిన ఇళ్ల పన్నులపై కమిటీ : డీపీవో అరుణ



డీపీవో అరుణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు గ్రామ పంచాయతీలో గత పాలక వర్గంలో పెంచిన ఇళ్ల పన్నులపై ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ వేసి విచారణ చేపట్టనున్నట్లు డీపీవో జె. అరుణ తెలిపారు. గురువారం గ్రామ పంచాయతీలో పెరిగిన ఇళ్ల పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఉన్నతాధికా రుల ఆదేశాలు మేరకు దీంతో డీపీవో గురువారం పంచాయతీ కార్యాలయంలో సమస్యలపై నాయకులతో విచారించారు. నాయకులు చలమలశెట్టి రమేశ్ బాబు, టీడీపీ నాయకులు వేగుంట రాము, యలమంచిలి మూర్తి, తదితరులు గ్రామంలో పెంచిన ఇళ్ల పన్నుల తీరుపై వివరించారు. పెంచిన పన్నులు చెల్లించలేని పరి స్థితి గ్రామంలో ఉందని తెలిపారు. పన్నులను తగ్గించాలని కోరారు. దీంతో డీపీవో స్పందించి నెల రోజుల్లో పెంచిన ఇళ్ల పన్నులపై కమిటీ వేసి విచారణ జరిపించి నివేదిక తీసుకుంటామని తెలిపారు. వచ్చిన నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని ధర్మ కోనేరు చెరువు గట్టును వాకింగ్ పార్క్‌గా అభివృద్ధి చేయడానికి అనుమతి ఇవ్వాలని నాయకులు కోరారు. సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, ఉప సర్పంచ్ దుట్టా శివన్నారాయణ, కొమరవల్లి కిరణ్ మూర్తి. వార్డు సభ్యులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు మరమ్మతులు

ప్రసాదంపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి) : నిడమానూరులోని వ్యవసాయ భూముల్లో నుంచి వెళ్లే విద్యుత్ లైన్లు ప్రమాదభరితంగా ఉన్నాయని స్థానికులు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి గురువారం తీసుకెళ్లారు. సమస్యను తెసుకు న్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను నిలబెట్టి విద్యుత్ తీగలను సరిచేశారు. తమ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు స్థానిక రైతులు, ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బాపులపాడు మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం మేఘాలు కమ్మివేయడంతో చీకటి ఆవరించింది. అనంతరం ఉరుములతో కూడిన వర్షం పడటంతో 2 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



● నిర్మానుష్యంగా రహదారులు

మండే ఎండకు తోడు ఉక్కపోత, వడగాల్పులకు ఉయ్యూరులో గురువారం రహదారులు జనసంచారం లేక నిర్మానుష్యంగా కన్పించాయి. అనునిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు బోసిపోయాయి.
(ఉయ్యూరు- ఆంధ్రజ్యోతి)

జనసైనికుడికి ఆర్థిక సాయం



ఉంగుటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో వున్న జనసైనికులకు పార్టీ అండగా నిలిచి ఆదుకుంటుందని ఉమ్మడి కృష్ణాజిల్లాల జనసేన నాయకులు గరికిపాటి శివశంకర్ అన్నారు. మండలంలోని పెదఅవుటపల్లికి చెందిన జనసైనికుడు షేక్ అల్లాబక్షు ఇటీవల గొంతు క్యాన్సర్‌కు గురై ఆపరేషన్ చేయించుకున్నారు. స్థానిక జనసైనికుల ద్వారా విషయం తెలుసుకున్న శివశంకర్ గురువారం అల్లాబక్షు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ మండల అధ్యక్షుడు బర్మా భువన్‌భాస్కర్, జనసైనికులు తోట వెంకటేశ్వరరావు, షేక్ సిరాజ్, నాగరాజు, యర్రంశెట్టి దేవేంద్ర, తంబి, గంటా మారుతి, పసుపులేటి శ్రీనివాసరావు, పొనమాల రాజు, అభిలాష్, షేక్ అబ్దుల్ మజీద్, షేక్ షబ్బీర్, షేక్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.





యమలోకానికి బైపాస్?

● మృత్యు మార్గంగా ఎన్‌హెచ్-16 ● అధ్వాన నిర్వహణతో ప్రమాదకరంగా జాతీయ రహదారి ● 20 కిలోమీటర్ల దూరంలో 24 బ్లాక్ స్పాట్స్ ● అక్కరకురాని హైవే అంబులెన్స్, 1033 పెట్రోలింగ్ వాహనాలు ● ఎన్ని కథనాలు వచ్చినా చలించని అధికారులు, టోల్‌గేట్ సిబ్బంది



వీరవల్లి బైపాస్ వద్ద అడుగు ఎత్తు కూడా లేని డివైడర్‌పై నుంచి దూసుకువచ్చి ప్రమాదానికి కారణమైన కారు (ఫైల్ ఫొటో)

హనుమాన్ జంక్షన్ రూరల్, ఆంధ్రజ్యోతి: జాతీయ రహదారిపై ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన స్థితిలో ఎన్‌హెచ్-16 (కలపర్రు టోల్‌ప్లాజా నుంచి అవుటపల్లి వరకు) తయారైంది. ముఖ్యంగా వీరవల్లి బైపాస్‌తో పాటు బొమ్ములూరు వద్ద హనుమాన్‌జంక్షన్ మెర్జింగ్ పాయింట్ (కూడలి) వద్ద, బొమ్ములూరు, ఉమామహేశ్వరపురం ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతూ ప్రాణాలు పోతున్నాయి. ఈ 20 కిలోమీటర్లలోనే 24 బ్లాక్‌స్పాట్‌లు (ప్రమాదకర ప్రదేశాలు) గుర్తించారంటే ఎంత ప్రమాదకరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వీరవల్లి బైపాస్‌లోనే వంపులు అధికంగా ఉండటం, వంతెనల వద్ద వాహనాలు ఎగిరిపడటంతో అదుపుతప్పి ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండ్రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో వధూవరులతో పాటు కుటుంబసభ్యులు మృతి చెందడం ఇందుకు నిదర్శనం. ఒకే కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు మరణించడం బాధాకరం.

నిర్వహణ అధ్వానం

రెండు టోల్‌గేట్లకు మధ్యనున్న వీరవల్లి బైపాస్‌పై 3 రోజుల క్రితం ప్రమాదం జరిగి ప్రాణాల మీదకు వస్తే 10 నిమిషాల్లో వచ్చే అవకాశమున్న అంబులెన్స్ గానీ, 1033 హైవే పెట్రోలింగ్ సిబ్బంది కానీ రాలేకపోయారంటే నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో అర్థమౌతోంది.

హైవేపై యథేచ్ఛగా లారీల నిలిపివేత

హైవేపై ఏదైనా కారణాలతో భారీ వాహనాలు ఆగిపోతే హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే స్పందించాలి. నిరంతర గస్తీ తిరుగుతుంటే వాటిని గుర్తించి క్రేన్‌లతో వాహనాలు ట్రక్ లే బైపాస్‌లోకి తీసుకువెళ్లాలి. అలాగే హోటళ్లు, వివిధ మెర్జింగ్ పాంట్లు(కూడళ్లు) హైవేపై లారీలు ఆగకుండా చూడాలి. ఇవేమీ జరగడం లేదు.

వాహన తనిఖీలు, పర్యవేక్షణ నిల్

హైవేపై నిఘా కెమెరాలు, స్పీడ్‌గన్‌తో అతివేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలి. కానీ రవాణా, పోలీసుశాఖ వాటి సంగతి మచ్చిపోయింది. ఎంతసేపు ఎన్ని చలానాలు రాశాం, ఎంత జరిమానా వేశామనే దానిపైనే దృష్టి. అసలు స్పీడ్‌గన్‌లు ఎన్ని ఉన్నాయి.. అవి పని చేస్తున్నాయా లేదా అనేది తెలియని దుస్థితి.

మొక్కుబడిగా రహదారి భద్రత

మితిమీరిన వేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడం లాంటివి నిరోధిస్తూ ప్రమాదాలను నివారించడం రహదారి భద్రత నియమావళి. ప్రజలు గానీ, అధికారులుగానీ వీటిని పట్టించుకుంటున్నారా అంటే లేదనే సమాధానం. రహదారి భద్రతా వారోత్సవాలు జరిగినప్పుడు మాత్రమే మొక్కుబడిగా అవగాహన కల్పించడం తప్ప చర్యలు మాత్రం శూన్యం.

డ్రంక్ అండ్ డ్రైవ్‌ను అరికట్టాలి

ద్విచక్రవాహనంపై ఇద్దరికి మించి వెళితే తక్షణం వాహనం స్వాధీనం చేసుకోవాలి. మైనర్లకు వాహనాలిచ్చిన వారికి కౌన్సెలింగ్ సహా జరిమానాలు విధించాలి. తెల్లవారుఝామున వాష్ అండ్ గో ద్వారా డ్రైవర్లకు అవగాహన కల్పించాలి. ఏది ఏమైనా అధికారులు, ప్రజలు కలిసికట్టుగా రహదారి నియమావళి కఠినంగా అమలు చేస్తేనే ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోకుండా ఆపగలం.



చెట్ల నరికివేతను పరిశీలించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, చిత్రంలో డాక్టర్ డిఆర్‌కె ప్రసాద్, సీఐలు

చెట్లు నరికితే సహించం

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆగ్రహం

చల్లపల్లి/మోపిదేవి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఇష్టారాజ్యంగా వాల్టా చట్టం ఉల్లంఘించి రోడ్లపక్కన చెట్లను నరికితే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం చల్లపల్లి, మోపిదేవి మండలాల పరిధిలో పెదకళ్లేపల్లి రోడ్డులో పలుచోట్ల చెట్లను నరికివేయటం, జాతీయ రహదారి పక్కనే మొక్కలు తగలబెట్టిన తీరును గురువారం మధ్యాహ్నం ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయా ఘటనలపై ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కలు నరికిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ఎంతటివారైనా ఉపేక్షించవద్దని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశానికి ఆదర్శంగా నిలిచిన స్వచ్ఛచల్లపల్లి స్ఫూర్తిని, మొక్కల పెంపకంలో పడే శ్రమను పట్టించుకోకుండా ఎవరికి వారు చెట్లను నరకటంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో అధికారులు ఖచ్చితంగా చట్టాన్ని పరిరక్షించి అమలుచేయాలన్నారు. ఈ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలనీ, అధికారులు వెంటనే చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. చట్టాల అమలులో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టంచేశారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, తహసీల్దార్ డి.వనజాక్షి, ఎంపీడీవో ఏవీ రమణ, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సీఐ కె.ఈశ్వరరావు, ఎస్‌ఐ పీఎస్‌వి సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు మత్తి గోపాల కృష్ణ, అమలేశ్వరరావు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మల్లవల్లి పారిశ్రామికవాడలో

మౌలిక సదుపాయాలకు కృషి

● ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ పాలకభవనం ఏర్పాటుతో పాటు విద్యుత్ అవాంతరాల్లాంటి సమస్యలను పరిష్కరిస్తూ మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌ను రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిపేలా కృషి చేస్తానని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం రాత్రి పారిశ్రామికవాడలోని హరిత ట్రాన్స్‌ఫార్మర్ల తయారీని ఆయన పరిశీలించారు. అలాగే ఎగుమతి తదితర విషయాలను కూడా ఆయన తెలుసుకున్నారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టిముక్కల రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ అవాంతరాలతో ఉత్పత్తి దెబ్బతినడంతో పాటు వివిధ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, విద్యుత్ ఆవాంతరాలను నివారించడానికి 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ అత్యవసరమన్నారు. ఏపీఐఐసీ భూమి కేటాయించకపోవడం వల్లే మంజూరైన సబ్‌స్టేషన్ నిర్మాణం ఆగిపోయిందన్నారు. పారిశ్రామికవాడలో ప్రస్తుతం 4వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని వారికి వైద్య సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని, పోలీస్ అవుట్ పోస్టు, ఫైర్ స్టేషన్ కూడా ఏర్పాటయ్యేలా చూడాలన్నారు. ఏపీఐఐసీ పరిపాలనా భవనం, నీటి కొరత లేకుండా చేయాలని కోరారు. సమస్యలను సావధానంగా విన్న యార్లగడ్డ త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని, అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దకు అసోసియేషన్ ప్రతినిధులను తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు యువతకు ఉపాధి ఉద్యోగావకాశాల కల్పించాల్సిన బాధ్యత మాత్రం పారిశ్రామికవేత్తలదే నన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మురళీధర్, కార్యదర్శి ఫణీంద్ర కుమార్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో అసోసియేషన్ ప్రతినిధులు

పర్యాటకులకు మధురానుభూతిని కల్పిద్దాం

● ఆకర్షణీయంగా కొండపల్లి ఖిల్లా, బొమ్మల తయారీ కేంద్రాలు ● ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు ● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులకు మధురానుభూతిని కల్పించేలా కొండపల్లి ఖిల్లా, కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయడంతో పాటు ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు తెలిపారు. పర్యాటక శాఖ అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్ఠాత్మక కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రం, కొండపల్లి ఖిల్లాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేందుకు అపార అవకాశాలున్నాయన్నారు. కొండపల్లిలో సుమారు 400 ఏళ్లకు పైగా రాజస్థాన్‌కు చెందిన హస్త కళాకారులు అత్యంత కళానైపుణ్యంతో తయారుచేసిన బొమ్మలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. కొండపల్లి పరిసర ప్రాంతాల్లో లభ్యమయ్యే తెల్ల పొణికి చెక్కతో రూపొందించే ఈ బొమ్మలకు మరింత ప్రాచుర్యం కల్పించాలని, కళాకారులను ప్రోత్సహించాలని, జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మల విశిష్టతను పర్యాటకులకు చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలన్నారు. కొండపల్లి బొమ్మల కాలనీ నుంచి ఖిల్లా వరకున్న మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. కొండపల్లి వద్ద పర్యాటకులు ట్రెకింగ్ నిర్వహించుకొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర టూరిజం అథారిటీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ ఎస్.పద్మారాణి, టూరిజం కన్సల్‌టెంట్ సాహితి, జిల్లా పర్యాటక అధికారి ఏ శిల్ప, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

దోమల నియంత్రణతోనే డెంగ్యూ నివారణ

దోమల నియంత్రణతోనే డెంగ్యూ వ్యాధిని అరికట్టగలుగుతామని అధికారులు, ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రాణాంతక డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. 16న జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా వైద్యారోగ్య శాఖ, వీఎంసీ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ అధికారులతో గురువారం లక్ష్మీశ, కలెక్టరేట్ నుంచి జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించి అనంతరం అవగాహన పోస్టరును విడుదల చేశారు. జిల్లా మలేరియా అధికారి వి.మోతిబాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని, వైద్య ఆరోగ్యశాఖ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీలింగ్ ల్యాండ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

వన్‌టౌన్: సీలింగ్ ల్యాండ్‌కు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సీలింగ్ ల్యాండ్ కేసులపై తీసుకోవాల్సిన తక్షణ చర్యలు గురించి విజయవాడ, నందిగామ, తిరువూరు, రెవెన్యూ డివిజనల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భూసంస్కరణ యాక్ట్ 1973 ప్రకారం ఆర్డీవోలు, వారి డివిజన్ పరిధిలో ట్రిబ్యునల్ అథారిటీ కావున సంబంధిత కేసులను తక్షణమే పరిష్కరించి సీలింగ్ ల్యాండ్స్ కింద ఆ భూములను స్వాధీనం చేసుకుని 22ఏ నిషేధిత జాబితాలో సంబంధిత వివరాలను పొందుపరచాలని ఆదేశించారు. సీలింగ్ ల్యాండ్స్ అంశంపై ప్రతి వారం సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రాంగణంలో బ్లేడ్‌బ్యాచ్ ఆగడాలు

● కొరవడిన పోలీసు నిఘా



బస్‌స్టేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ప్రాంగణంలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు రోజురోజుకీ మితిమీరుతున్నాయి. కృష్ణలంక పోలీసులు, బస్‌స్టేషన్ భద్రతా సిబ్బంది భద్రత కొరవడటంతో అర్ధరాత్రి సమయంలో బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు మద్యం మత్తులో ఒకరిద్దరు ప్రయాణికులను అడ్డగించి డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. లేదంటే పదునైన ఆయుధాలతో దాడికి పాల్పడుతున్నారు. ఎరైవల్ బ్లాక్‌ను కేంద్రంగా చేసుకుని వీరు రాత్రివేళలో అక్కడే పడుకుంటున్నారు. రాత్రివేళలో డ్యూటీలో ఉన్న పోలీసులు పట్టించుకోకపోవటంతో ఎరైవల్ బ్లాక్‌ను తమ అడ్డాగా మార్చుకున్నా టరు. ఇటీవల అక్కడ నిద్రపోతున్న బ్లేడ్ బ్యాచ్ సభ్యులను డ్యూటీలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగి లేపి వెళ్లిపోమ్మన్నందుకు ఆ ఉద్యోగితో గొడవపడి దాడికి ప్రయత్నించారు. ఎరైవల్ బ్లాక్, డిపార్చర్ బ్లాక్, సిటీ బస్ టెర్మినల్, వంతెన ఏరియా, కాల్వగట్టు ప్రాంతాలతో పాటు బస్‌స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ ప్రాంతాల్లో వీరు ఎక్కువగా తిరుగుతూ ప్రయాణికులను నగదు, విలువైన వస్తువులను లాక్కొంటున్నారు. ప్రశ్నించిన వారిపై ఆయుధాలతో దాడికి పాల్పడుతున్నారు. గురువారం తెల్లవారుజామున 2.45 గంటలకు శ్రీశైలం నుంచి సిటీ బస్ టెర్మినల్ వద్ద ఎం.కృష్ణారావు, సనావుల్లాలు బస్ దిగారు. సనావుల్లా వాష్ రూమ్‌కు వెళ్లగా, కృష్ణారావు ఆటోకోసం నిలబడి ఉండగా, గంజాయి మత్తులో ఓ యువకుడు కృష్ణారావు వద్దకు వచ్చి డబ్బులు డిమాండ్ చేశాడు. నిరాకరించటంతో దాడికి పాల్పడ్డాడు. భయంతో అక్కడి నుంచి పరిగెత్తుతుండగా వాష్‌రూమ్ నుంచి వచ్చిన సనావుల్లా ఆపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో కృష్ణారావుకు గాయాలవగా సనావుల్లా అతడిని హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు.

రాత్రివేళలో ఆయా ప్రాంతాల్లో కృష్ణలంక పోలీసులుగానీ, బస్‌స్టేషన్ భద్రతా సిబ్బంది పర్యవేక్షణ లేకపోవటంతో వీరి ఆగడాలు మితిమీరుతున్నాయని బాధితులతో పాటు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఈ వివరాలు పోలీసులకు తెలిసినా చర్యలు తీసుకోవటంలో వెనకడుగు వేస్తున్నారని వ్యాపారులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. గురువారం ప్రయాణికుడిపై దాడి గురించి కృష్ణలంక సీఐ నాగరాజును వివరణ కోరగా తమకెవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.



విద్యుత్ దీపాలతో అలంకరించిన అభయాంజనేయ స్వామి ఆలయం

హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి

● రేపటి నుంచి అభయాంజనేయ స్వామి ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో వేంచేసి ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో 24వ హనుమజ్జయంత్యుత్సవాలు నిర్వహించడానికి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. శనివారం నుంచి ఈ నెల 22 వరకు ఉత్సవాలు నిర్వహనకు సన్నాహాలు పూర్తి చేశారు. కొద్ది రోజుల కిందట ఆలయంతో పాటు ఎదురుగా ఉన్న రామాలయానికి ఏలూరుకు చెందిన వంకినేని పూర్ణచంద్రరావు కుటుంబ సభ్యులు రంగులు వేయించి అందంగా తీర్చిదిద్దారు. 5 రోజులు పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో స్వామికి ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు, పౌరాణిక నాటకాలు ఏర్పాటు చేశారు. భక్తులు తవ్వా పూర్ణచంద్రరావు 18 కేజీలు, బోడిచర్ల రాంబాబు 25 కేజీల లడ్డూ ప్రసాదాలను ఉత్సవం ప్రారంభం రోజున సమర్పించనున్నారు. ఈవో తారకేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గత ఉత్సవాలను రూ.18లక్షలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఖర్చులకు అధికారులు నుంచి అనుమతి రాకపోవడం గమనార్హం.

క్లస్టర్ విధానంలో లోపాలను సరిచేయాలి

● వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

గాంధీనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): రేషనలైజేషన్ పేరుతో జరుగుతున్న క్లస్టర్ విధానంలో లోపాలను ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్ రవీంద్రరాజు సీఎస్ కే విజయానంద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ సీఎస్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఒక సచివాలయానికి ఒక వీఆర్వో విధులు నిర్వహిస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని క్లస్టర్ విధానంతో పని ఒత్తిడి మరింత పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వీఆర్వోఏలు భవిష్యత్తులో వీఆర్వోలుగా ప్రమోషన్లు పొందలేరన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి మండలాల్లో తహసల్దార్‌లను సంప్రదించకుండా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు చేస్తున్న అసంబద్ధ క్లస్టర్ విధానంతో అనేక భూసమస్యలు పరిష్కారం కాక రైతులు ఇబ్బందులకు గురవుతారన్నారు. దీంతో ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఆయా సమస్యలపై సీఎస్ సానుకూలంగా స్పందించినట్లు రవీంద్రరాజు తెలిపారు.



శిక్షణకు హాజరైన మహిళలతో మాట్లాడుతున్న శంకరరావు

ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలి

● బీసీ కార్పొరేషన్ ఈడీ

రాణీగారితోట, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా ఆర్థికంగా స్థిరపడి కుటుంబానికి అండగా ఉండాలనే ప్రధాన ఉద్దేశంతో ప్రభుత్వం కుట్టుమిషన్ శిక్షణ వంటి వాటిని ప్రోత్సహిస్తోందని బీసీ కార్పొరేషన్ ఈడీ శంకరరావు అన్నారు. రాణీగారితోట 18వ డివిజన్‌లోని సిమెంట్ గోడౌన్‌లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన కుట్టు శిక్షణా కేంద్రంలో శిక్షణా తరగతులు ఇటీవల ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గురువారం శంకరరావు ఈ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలోని మౌలికవసతులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు మొత్తం 140 మందితో రెండు బ్యాచ్‌లుగా, బ్యాచ్‌కి 70 మందితో నిర్వహించడం జరుగుతుందని, 90 రోజుల పాటు జరిగే ఈ తరగతుల్లో 75శాతం హాజరున్నవారికి శిక్షణానంతరం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామన్నారు. టీడీపీ తూర్పు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కెర తిరుపతయ్య శిక్షణకు హజరైన మహళలకు శీతలపానియాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఎంతో శ్రద్ధతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని, స్థానిక బీసీ, ఓసీ మహిళలు సద్వినియోగంచేసుకోవాలని కోరారు. బీసీ కార్పొరేషన్ సూపరింటెండ్ రాజేంద్రబాబు పాల్గొన్నారు.

అపర భగీరథుడు

సర్ ఆర్థర్ కాటన్: ఆళ్ల

విజయవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం దగ్గర గోదావరి నదిపై ఆనకట్ట నిర్మించి ఆ ప్రాంత ప్రజల హృదయాల్లో అపర భగీరథుడిగా సర్ ఆర్థర్ కాటన్ పేరు సంపాదించుకున్నారని సాగు నీటి వినియోగదారుల సంఘాలసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు అన్నారు. ఆర్థర్ కాటన్ 222వ జయంతి సందర్భంగా విజయవాడలోని జలవనరుల శాఖ ఆవరణలోని కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో తొలిసారిగా కృష్ణ, గోదావరి డెల్టాలకు కాల్వల ద్వారా ఆయకట్టు, డ్రైనేజీ నిర్మించి మార్గదర్శకులయ్యారన్నారు. ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో గోదావరి నీటి వృథాను అరికట్టడానికి పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.15వేల కోట్లు నిధులు సమీకరించారన్నారు. పోలవరం నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం అభినందనీయమని గోపాలకృష్ణ అన్నారు.



కాటన్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆళ్ల వెంకటగోపాలకృష్ణ, రాష్ట్ర తెలుగురైతు ప్రధానకార్యదర్శి కుర్రా నరేంద్ర



అధికారులతో మాట్లాడుతున్న లక్ష్మీపార్థసారధి

కార్మికులకు మెరుగైన వసతులు

● ఏడీసీ చైర్‌పర్సన్, ఎండీ లక్ష్మీపార్థసారథి

పాయకాపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీపార్థసారధి గుత్తేదారు సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. రాజధాని అమరావతి నిర్మాణపనులను గురువారం ఆమె పరిశీలించారు. ముందుగా తుళ్లూరు ఆర్‌వీఆర్ సంస్థ క్యాంపును తనిఖీ చేసి అక్కడ కార్మికులు నివేశించేందుకు ఏర్పాటు చేసిన నివాస గృహాలు, తాగునీరు సరఫరా, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల కల్పన, కనీస వసతులను పరిశీలించారు. పనిచేస్తున్న కార్మికులు ఏ ఏ రాష్ట్రాల నుంచి వచ్చారనే విషయమై ఆరా తీశారు. అలాగే గుత్తేదారు సంస్థలు కార్మికులకు కల్పిస్తున్న భోజన వసతిని కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. అధికారులు టి. మోజెస్‌కుమార్, డాక్టర్ కేవీ గణేష్‌బాబు, ఎస్‌ఈలు శ్రీనివాసరావు, నరసింహారావు, బి శ్రీధర్, టి పద్మాకర్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వద్దు

గుడివాడ, మే 15(ఆంధ్రజ్యోతి) : వార్డులో పారిశుధ్య నిర్వహణ పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ హెచ్చరించారు. స్థానిక 11వ వార్డులో గుడ్ మార్నింగ్ గుడివాడ పేరిట గురువారం కమిషనర్ పర్యటన చేపట్టారు. వార్డులో మంచినీటి సమస్య, డ్రెయినేజీ, పారిశుధ్య సమస్యలను పరిశీలించారు. స్థానిక సమస్యలను వార్డు ఇన్‌చార్జ్ సయ్యద్ జబీన్ కమిషనర్‌కు వివరించారు. వార్డు నాయకులు కరీముల్లా, పట్టపు చిన్నా, బాజీ, సమీ, రిజ్వాన్, బాజాని, రఫీ, మోబీన్, బాబావలి, జలీల్, పాల్గొన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

భారీ వాహనాల తాకిడికి ధ్వంసమవుతున్న రోడ్లు

తోట్లవల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఓవర్ లోడు ఇసుక లారీలతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. యాకమూరు ఆర్అండ్‌బీ రోడ్డుపై గురువారం ఓవర్ లోడుతో వస్తున్న ఇసుక లారీ కమాన్ కట్టలు విరిగిపోయి ఓ ప్రక్కకు ఒరిగిపోయింది. దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. పరిమితికి మించి 40 టన్నుల ఇసుక లోడుతో వచ్చే లారీలపై ఇకనైనా రవాణాశాఖ, పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. గురువారం పామర్రు ఒకటో గ్రామ సచివాలయంలో పౌరులకు అందుతున్న పౌరసేవలను పరిశీలించారు. ప్రజలనుంచి వచ్చిన అర్జీలను గురించి సచివాలయ ఉద్యోగ సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న రేషన్‌కార్డుల మంజూరు, పేదలకు ఇంటిస్థలాలకు తీసుకోవాల్సిన దరఖాస్తులు తీసుకుని అర్హతగల వారిందరికి మేలు జరిగేలా చూడాల్సి బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. రేషన్‌కార్డులు మంజూరుకు ఈనెల 30వరకే గడువు ఉండడంతో తక్షణమే వాటిపై దృష్టిసారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఒకరు డిప్యూటేషన్‌పై గన్నవరం, మరో ఒకరు ప్రసూతి సెలవుల్లోడిజిటల్ అసిస్టెంట్లు లేక 4,5 సచివాలయాల్లో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నమని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయన స్పందిస్తూ సెలవులపై వెళ్లినవారి స్థానాల్లో ఇన్‌చార్జిలు మరొకరికి బాధ్యతలు అప్పగించాలని ఎంపీడీవో కె.జ్యోతి, కార్యదర్శి సలీంలకు ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వీరంకి వేంకటేశ్వరరావు, తాడిశెట్టి మధు, నూకవరపు వీరాంజనేయులు, పరిసె సుబ్రమణ్యం, దాలిపర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంగల ప్రతి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఘనత టీడీపీదేనని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. కురుమద్దాలికి చెందిన టీడీపీ కార్యకర్త మిన్నకూరి మేరి(39) ఇటీవల చిలకలూరిపేట జాతీయ రహదారిపై మొక్కలను నీళ్లు పోస్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. మృతురాలి కుటుంబానికి మంజూరైన బీమాచెక్కును గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. టీడీపీ సభ్యత్వం ఉంటే కుటుంబానికి భరోసాఅని, కేవలం ఒక వందరూపాయలు కడితే ఐదులక్షల బీమా అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.19,30,667 చెక్కులను 24మంది బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లి గణేష్, పామర్రు డీసీ చైర్మన్ కొసరాజు వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రజలకందుతున్న పౌర సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

మట్టి నమూనా కేంద్రం పరిశీలన

గుడివాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో మట్టి నమూనా కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభించనున్నట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వై.వి.ఎస్.మనోహర్ అన్నారు. గురువారం గుడివాడ మార్కెట్ యార్డులో ఉన్న మట్టి నమూనా కేంద్రంలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవిని ఏయే వస్తువులు రిపేర్లు అయినవి, ఏ విధంగా మరమ్మతులు చేస్తున్నారు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. మట్టి నమూనా కేంద్రంలో వేలాది మట్టి నమూనాలు పరీక్షించనున్నామన్నారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భూమి వివరాల నమోదు తప్పనిసరి

గుడివాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): అన్నదాన సుఖీభవ పథకం కోసం రైతులు భూమి వివరాలు వ్యాలిడేషన్ జరుగుతుందని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ భూమి వివరాలు, రైతుల నమోదైన రైతులకే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల ద్వారా నగదు బదిలీకి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 25వ తేదీలోగా వివరాలు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. కేవలం రైతుల ఐడి ఉన్న పట్టాదారు రైతులకు మాత్రమే నగదు బదిలీ చేస్తామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యేక బయోమెట్రిక్ ద్వారా వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో బోలెం అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల పట్ల అవగాహన తప్పనిసరి

● టి.రాజేంద్రప్రసాద్

పామర్రు, మే 15 (ఆంధ్రజ్యోతి): తూనికలు కొలతల పట్ల వినియోదారులు తప్పనిసరిగా అవగాహన కలగడం ద్వారా తూకాల్లో జరిగే మోసాలను అరికట్ట వచ్చునని జిల్లా తూనికల కొలతల సహాయ అధికారి టి.రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రపంచ తూనికల కొలతల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీప్రియా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో వినియోదారులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, పెట్రోల్, డిజిల్ కొనుగోలు విషయంలో పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వినియోదారులు నిత్యం వినియోగించే గ్యాస్ సరఫరాతో పాటు ఇతర వ్యాపారాల్లో జరిగే తూకాల్లో మోసాలను ఎలా గుర్తించాలో వివరించారు. వినియోదారులు తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ కాటాల్లో తూకం వేసేటప్పుడు తప్పనిసరిగా డిస్ప్లేలో జీరో ఉందోలేదో చూసుకోవాలన్నారు. పెట్రోలుబంకుల్లో ఇంధనం పోసుకునే క్రమంలో కల్తీని గుర్తించడానికి అక్కడ ఫిల్టర్ పేపర్ తీసుకుని దానితో నాణ్యతను పరిశీలించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణరాజు శ్రీప్రియ గ్యాస్ కంపెనీ అధినేత జె.సతీష్‌రెడ్డి, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ రంగారావు గ్యాస్‌కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు. తొలుతజిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రాజేంద్రప్రసాద్‌ను గ్యాస్ కంపెనీ ఎండీ సతీష్, సిబ్బంది దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.



టి. రాజేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న సతీష్



మట్టి తవ్వుతున్న జేసీబీ



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

కాజలో అక్రమ మట్టి తవ్వకాలు

కూచిపూడి, మే 15 (ఆంధ్రజ్యోతి): కాజలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మల్లంపల్లి డొంకలో తవ్వకాలు జరిపి మట్టిని తరలిస్తుండగా, రెవెన్యూ అధికారులు గురువారం ఉదయం మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో ఐదు ట్రాక్టర్లకు అపరాధ రుసుము విధించి అందుకు సంబంధించిన వ్యక్తులను మందలించారు. అవేవీ పట్టని అక్రమార్కులు తిరిగి మధ్యాహ్నం తవ్వకాలు యథావిధిగా ప్రారంభించటంపై గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ మస్తాన్‌ను వివరణ కోరగా మండలంలో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, మట్టితవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో ట్రాక్టర్లను గుర్తించి ఫైన్ విధించినట్లు తెలిపారు. అయినప్పటికీ తిరిగి తవ్వకాలు కొనసాగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలు సీజ్‌చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

● కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణస్వామి

పెదపారుపూడి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.వి.లక్ష్మణస్వామి అన్నారు. గురువారం పెదపారుపూడి చెరువు గట్టు వద్ద ప్రైవేట్ పాఠశాలలో సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పలపాటి అనూష ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ స్కీమ్ వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు పథకాలు అమలు కావటం లేదని, కనీసం వేతనాలు చేయలేదన్నారు. కార్మికులను ఉద్యోగులను మరింత అభద్రతలోకి నెట్టిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు కౌలు రైతుల రుణాలు, రెండు లక్షల లోపు రద్దు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం 200 రోజులకు రోజు కూలి రూ.600లకు పెంచాలన్నారు. కౌలు రైతులు రక్షణకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఓ.గంగాధర్ ప్రసాద్, అబ్రహం, విజయ్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ : ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గురువారం స్థానిక సుందరయ్యభవన్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం, ఇతర కార్మిక సంఘాలు సన్నాహక సమావేశం ఏర్పాటు చేసుకుని సమ్మెను జయప్రదం చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, దాసు శ్యాంప్రసాదు,రేపాని కొండ, సుందరయ్య, డాల్ఫిన్, కృష్ణ, కోరం రాజు, రాము, అశోక్, ప్రభుదాసు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక ఆటోనగర్‌లో నాయకులు బొంతు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు వెంకటేశ్వరరావు, ఆర్‌సీపీ రెడ్డి, సి.హెచ్ శివ, రేపాని కొండ, నాగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : ఈ నెల 20వ తేదీన జరగనున్న కార్మిక సమ్మెకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని సీపీఎం , అనుబంధ సంఘాల నాయకులు శివనాగేంద్రం, కె కొండలబాబులు కోరారు. తోట్లవల్లూరులో గురువారం వారు కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కె సీహెచ్ సుబ్బారావు, ఈ డేవిడ్‌రాజు, ఎ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టి.వి.లక్ష్మణస్వామి

అభ్యాసన పద్ధతులపై అవగాహన



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఎంవీఎస్.లక్ష్మీ

పెదపారుపూడి, మే 14 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులలో భాగంగా గురువారం విద్యార్థులకు, పిల్లలకు క్విజ్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి ఎంవిఎస్.లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అభ్యాసన పద్ధతులపై దృష్టిసారించాలన్నారు. తద్వారా పరీక్షల్లో మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. విద్యార్థులు ఆద్యంతం ఎంతో ఉత్సాహంగా తమను అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు

పార్టీలో కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు

పెదపారుపూడి, మే 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీకోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. గురువారం మోపర్రులో వంగా రంగారావు అనారోగ్యంతో ఉండగా, గృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వట్టెం రమాదేవి పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉజ్జినేని అనిల్ కుమార్, జూపల్లి రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి హోమం నేడు

గుడివాడ : ఈ నెల 16వ తేదీ శుక్రవారం వైశాఖ మాసం శుద్ధ చవితి సంకటహర చతుర్థి సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు దేవస్థాన కార్యాలయంలో రూ.516లు చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేయించుకోవాలన్నారు. పూజలో పాల్గొనే ఉభయదాతలకు పూజా సామగ్రిని దేవస్థానం వారే సమకూరుస్తారన్నారు. హోమం కుంకుమ, శేషవస్త్రం, ప్రసాదం అందించనున్నామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

గుడ్లవల్లేరులో వర్షం

గుడ్లవల్లేరు : అప్పటివరకూ వడగాల్పులు, ఉన్నటుండి వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి కారుమబ్బులు కమ్ముకొచ్చి దాదాపు గంటకు పైగా వర్షం కురిసింది. అప్పటివరకూ ఉక్కపోత, వేడిగాలితో ఇబ్బంది పడ్డ ప్రజానికానికి వర్షంతో సేదతీరారు.

దేశ క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు

గుడివాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ గుడివాడ దైవసేవకుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక కారుణ్య మినిస్ట్రీస్ చర్చిలో దేశంలో శాంతి సమాధానం, సైనికులు క్షేమంగా ఉండాలని కోరుతూ మోకాళ్లపై నిలబడి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నేలపాటి శ్యామ్యేలు, పాస్టర్లు సునీల్‌కుమార్, జి.యేహెజ్కేలు, సత్యం, ఏలీషా, నోవాహు, వరప్రసాద్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీని నెరవేర్చాలని ధర్నా

గుడివాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఇచ్చిన హామీ మేరకు శ్రీకాళహస్తి కాలనీ ప్రజలకు మంచినీరు అందించాలని శ్రీకాళహస్తి కాలనీ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షురాలు ఉత్తర లక్ష్మీ డిమాండ్ చేశారు. మల్లాయిపాలెం సచివాలయం-2ని కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం రెండుగంటల పాటు దిగ్బంధనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఎమ్మెల్యే వెనిగండ్లకు రెండుసార్లు గడువు ఇచ్చారని, 100 రోజులు, 30రోజులంటూ కాలం వెల్లదీస్తున్నారని మండిపడ్డారు. కాలనీలో నివాసముంటున్న వారికి పొజిషన్ సర్టిఫికేట్‌లను ఇవ్వాలన్నారు. ఖాళీ స్థలాలు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీలో పాఠశాల, ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని కోరారు. పైపుల ద్వారా మంచినీటిని వదిలే వరకు పోరాటం ఆగదని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో , మరియమ్మ, దుర్గ, బేబీ, స్వప్న, మాలతీ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న శ్రీకాళహస్తి కాలనీవాసులు

క్రీడాకారులకు క్రీడాస్ఫూర్తి తప్పనిసరి



టోర్నమెంట్ ప్రారంభించి, బ్యాటింగ్ చేస్తున్న ఎస్సై వీవీ సత్యనారాయణ

● ఎస్సై వీవీ సత్యనారాయణ

గుడ్లవల్లేరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడాలని, గెలుపు ఓటములు లక్ష్యపెట్టక జట్టు విజయానికి ప్రతి క్రీడాకారుడు కృషిచేయాలని గుడ్లవల్లేరు ఎస్సై వీవీ సత్యనారాయణ అన్నారు. అంగలూరులో గురువారం కొమ్మలపాటి సాయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను కొమ్మలపాటి సాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రాంభించారు. గతేడాది డిశంబర్‌లో క్రికెట్ ఆడుతూ మృతిచెందిన సాయి జ్ఞాపకార్థం వారి మిత్రులు ట్రస్ట్‌గా ఏర్పడి ఈ టోర్నమెంట్ ను ఏర్పాటు చేశారు. ఎటువంటి అలజడులు లేకుండా క్రమశిక్షణతో ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేసుకోవాలని నిర్వాహకులకు క్రీడాకారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో అంగలూరు సర్పంచ్ ఎం.రవికుమార్, బొర్రా ధనకోటేశ్వరరావు, శ్యామలరాజు, మేరుగుమాల బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సత్య గోల్డ్ యజమానికి మంత్రి రవీంద్ర పరామర్శ



మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : సత్య గోల్డు యజమాని నూకల సురేష్ తమ్ముడు నూకల రమేష్ మృతి చెందాడు. మంత్రి కొల్లు రవీంద్ర గురువారం నూకల సురేష్‌ను పరామర్శించారు. గోల్డు ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, చలమలశెట్టి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలిస్తున్న పి.వి.ఫణికుమార్

చిరు వ్యాపారులకు రుణాలు

మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : చిరువ్యాపారులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టీడీపీ నాయకుడు పి.వి. ఫణికుమార్ అన్నారు. పీఎం స్వానిధి పథకం కింద 45 వడివిజన్ సచివాలయంలో చిరువ్యాపారులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఫణికుమార్ మాట్లాడుతూ, చిరు వ్యాపారులకు రూ10 వేలు రుణం అందించేందుకు ప్రభు త్వం ముందుకు వచ్చిందన్నారు. చిరువ్యాపారులు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ నెంబరును సచివాలయానికి తీసుకుని సంక్షేమ కార్యదర్శికి ఇచ్చి ఆన్‌లైన్‌లో రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 45వడివిజన్ సచివాలయ అడ్మిన్ అల్లాబక్షు, నాయకులు గంజాల రవికుమార్, కొనకళ్ళ భాను తదితరులు పాల్గొన్నారు.

గృహాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

పెడన రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయించాలని ఎంపీడీవో అరుణకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 885 మంది లబ్దిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించగా 600 మంది నిర్మాణాలు పూర్తిచేశారని ఏఈ వహిద తెలిపారు. ఇంటి నిర్మాణ వ్యయం పెరిగిన నేపథ్యంలో బీసీ, ఎస్సీలకు ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తుందన్నారు. మే నెలాఖరి వరకు 104లో పది మంది పూర్తిచేయగా, మిగిలిన 94 మంది ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అరుణకుమారి అన్నారు.

డీఎంఏకు వైసీపీ ఫిర్యాదు హాస్యాస్పదం : టీడీపీ

పెడన, మే 15 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలంటూ వైసీపీ కౌన్సిలర్లు డీఎంఏకు ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, నాయకులు కమ్మంటి బాబు, యర్రా నాగరాజు, పరసా జితేంద్ర గురువారం విలేకరులతో మాట్లాడారు. పట్టణ అభివృద్ధిపై ఏనాడూ డీఎంఏకు వినతిపత్రం ఇవ్వని వైసీపీ కౌన్సిలర్లు తమ రాజకీయ స్వార్థం కోసం కమిషనర్‌పై ఫిర్యాదు చేయడం శోచనీయమన్నారు. మునిసిపాలిటీలో 43 మంది అక్రమ లే అవుట్‌దారులు ఉన్నారని బోర్డు పెట్టించిన వైసీపీ కౌన్సిలర్లు ఒక్క వేణుగోపాలరావుపైనే ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అక్రమ లే అవుట్‌దారులతో వైసీపీ కౌన్సిలర్లు బేరాలు కుదుర్చుకున్నట్లు భావిస్తున్నామన్నారు.

మత్స్యకార సంఘాల బలోపేతానికి చర్యలు

మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : పీఎంఎంఎస్‌వై, పీఎంఎంకెఎస్‌ఎస్‌వై పథకాల ద్వారా మత్స్యకార సహకార సంఘాలను బలోపేతం చేస్తున్నామని జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాగరమేష్ అన్నారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి మత్స్యకారుల సహకార సంఘ సమావేశానికి నాగరమేష్ అధ్యక్షత వహించి మాట్లాడారు. మత్స్యశాఖ జేడీ ఏ. నాగరాజు మాట్లాడుతూ, మత్స్యకారులు తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. మత్స్యకారుల ఫెడరేషన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గోవిందరావు, టెక్నికల్ టీమ్ మెంబర్ వెంకటరమణ పీఎంఎంఎస్‌వై, పీఎంఎంకెఎస్‌వై పథకాలపై అవగాహన కల్పించారు. లకనం నాగాంజనేయులు, విష్ణుమూర్తుల శ్రీనివాసరావు, మోకా విష్ణువర్ధనరావు, కర్రి కృష్ణమూర్తి, లంకే భాస్కర్ తదితరులు మాట్లాడారు.



మానవతావాది గుండు సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, మానవత ప్రతినిధులు

పేద విద్యార్థులకు చేయూతనందించాలి

మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు మానవతావాదులు చేయూతనందించాలని కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము కోరారు. మచిలీపట్నం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం మానవతా వాది గుండు సాయిప్రసాద్‌ను సత్కరించారు. ఉపాధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు జి.అశోక్‌కుమార్, అయ్యప్పస్వామి, అశోక్, పరిసె వెంకటేశ్వరరావు, భారతి, భార్గవి, పావని తదితరులు పాల్గొన్నారు.



ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న సురేష్‌బాబు తదితరులు

కొల్లూరి పోరాట పటిమ స్ఫూర్తిదాయకం

అవనిగడ్డ, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై కొల్లూరి వెంకటేశ్వరరావు పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. దివి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కొల్లూరి వెంకటేశ్వరరావును సురేష్ అవనిగడ్డలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కైతేపల్లి రాజేష్, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ పట్టాభి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ స్వర్ణశ్రీ తెలిపారు. కంప్యూటర్ డిటిపి, బ్యూటీ పార్లర్, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. తెలుపు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, మూడు ఫోటోలను మచిలీపట్నం రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న సంస్థలో అందజేయాలన్నారు.

ఏడు నియోజకవర్గాలకు తాగునీరందిస్తాం

మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు తాగునీటిని అందించేందుకు ప్రణాళిక రూపొందించామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తరకటూరు సమ్మర్ స్టోరేజ్ వద్ద రూ. 2.40 కోట్ల విలువైన రక్షిత మంచినీటి సరఫరా అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఈ స్కీం ద్వారా మచిలీపట్నంతో పాటు పెడన నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలను కలిపే విధంగా దాదాపు రూ. 2వేల కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులు జలజీవన్ మిషన్ కింద అందుబాటులోకి వచ్చాయన్నారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం నిధులను జోడించి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు ప్రకాశం బ్యారేజి నుంచి నీటిని అందించేందుకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రణాళికలు రూపొందించారన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రక్షిత మంచినీటి పథకాలకు అవసరమైన నిధులు కేటాయించలేదని, చంద్రబాబు సీఎం అయిన తరువాత ఫిల్టర్‌బెడ్ మరమ్మతులకు నిధులు కేటాయించారన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని, బీసీ నాయకుడు కొనకళ్ల జగన్నాథరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.



సమగ్ర రక్షిత నీటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



మంత్రి రవీంద్రకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామీణ వైద్యాధికారులు

మంత్రి కొల్లు రవీంద్రకు విలేజ్ క్లినికల్ ఆఫీసర్ల వినతి

మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ భద్రత కల్పించాలని, సీనియర్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మంత్రి కొల్లు రవీంద్రకు ఆయూష్మాన్ ఆరోగ్య మందిర్ విలేజ్ క్లినికల్ ఆఫీసర్లు వినతిపత్రం సమర్పించారు. బుధవారం నాటికి విలేజ్ క్లినికల్ ఆఫీసర్ల సమ్మె 18వ రోజుకు చేరుకుంది.



మే పుష్పం కనువిందు

అవనిగడ్డ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రపురంలో మే పుష్పం వికసించింది. మోదుమూడి సతీష్ ఇంటి ఆవరణలో మే పుష్పం గురువారం వికసించగా, పలువురు ఆసక్తిగా తిలకించారు.

ఘంటసాలలో...



ఘంటసాల, మే 15 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ హెడ్ మాస్టర్, సిద్ధాంతి వీసుపాటి వెంకట నరసింహారావు ఇంటిలో గురువారం మే పుష్పం వికసించింది. మామిడి చెట్టు కింద నేల మీద ఈ పుష్పం కనువిందు చేస్తుండడంతో గ్రామస్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

మాజీ సర్పంచ్ సీతారావమ్మ మృతి

బంటుమిల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చినబాబు మాతృమూర్తి, చినతుమ్మిడి మాజీ సర్పంచ్ వెలివెల సీతారావమ్మ(78) గురువారం తెల్లవారు ఝామున కన్నుమూశారు. ఆమె భర్త వెలివెల శివానందం డీసీఎంఎస్ వైస్ చైర్మన్‌గా , బంటుమిల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా పని చేశారు. ఆమె పెద్ద కుమారుడు వెలివెల సత్యనారాయణ తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్ రేంజ్ ఐజీగా పనిచేస్తున్నారు. రాజకీయ ప్రముఖులు, పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్, వైసీపీ పెడన ఇన్‌చార్జ్ ఉప్పాల రాము, కృష్ణజిల్లా చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, టీడీపీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీర బాబు, మట్టా నాగబాబు, కూనసాని గరుడప్రసాదు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు తిరుమాని శ్రీనవాసరావు, తదితరులు సీతారావమ్మ మృతదేహన్ని సందర్శించి ఘనమైన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



వెలివెల సీతారావమ్మ (ఫైల్)

పైపులైను విస్తరణ పనులు ప్రారంభం



చల్లపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలో తాగునీటి పైపులైను విస్తరణ పనులు గురువారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.50 లక్షల అంచనాతో కబేళా రోడ్డులో ఉన్న పంపింగ్ షెడ్ వద్ద నుంచి ఎస్సీ కాలనీ వైపు నూతన పైపులైన్ విస్తరణ పనులు చేపట్టారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఇరిగేషన్ ఏఈ వి.రామ్‌కుమార్, ఈవో పి.వి.మాధవేంద్రరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్ బోల్తా.. ఒరిగిన విద్యుత్ స్తంభాలు



మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : సుల్తానగరంలో గురువారం మట్టి ట్రాక్టర్ తిరగబడింది. విద్యుత్ స్తంభాల మీద పడటంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అతివేగమే ప్రమాదానికి దారి తీసిందని గ్రామస్తులు పేర్కొన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది హుటాహుటి మరమ్మతులు ప్రారంభించారు.

నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి

చల్లపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విత్తనాలను అధీకృత కంపెనీల నుంచి మాత్రమే కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలని మొవ్వ ఏడీఏ ఎస్.శ్యామల విత్తనాల డీలర్లకు స్పష్టం చేశారు. చల్లపల్లి వ్యవసాయశాఖ కార్యాలయంలో మండలంలోని విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. విత్తన చట్టం 1966 ప్రకారం విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలని సూచించారు. ఏవో జి.సాయిసింధు, డీలర్లు పాల్గొన్నారు.

మోదుమూడిలో భారీ అన్నసమారాధన

అవనిగడ్డ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : మోదుమూడిలో యాళ్లమ్మ తల్లి ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం మూడు వేల మందికి అన్నసమారాధన జరిగింది. అవనిగడ్డ సీఐ యువ కుమార్, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుతోపాటు పలువురు ప్రముఖులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. యాళ్లమ్మ అమ్మవారిని జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ - సాయి సుప్రియ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బచ్చు రఘునాథ్ ప్రసాద్, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు బచ్చు వెంకట నారాయణ, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు బచ్చు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ

అవనిగడ్డ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ రైతు సేవా కేంద్రం వద్ద పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ పశువుల దాణాను రైతులకు ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం పంపిణీ చేశారు. సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సాంబశివరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, డాక్టర్ నాగార్జున, రైతు సేవా కేంద్రం ఇంచార్జ్ శైలజ, ల్యాబ్ అసిస్టెంట్ డేవిడ్, మండలి శేషు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు పేర్లు నమోదు చేసుకోవాలి

నాగాయలంక, మే 15 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఖరీఫ్ పెట్టుబడి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని నాగాయలంక మం డల వ్యవసాయాధికారి ఏ.సంజీవ్ కుమార్ తెలిపారు. ఇప్పటికే పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో వేశామని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతు సేవా కేంద్రంలో ఈనెల 20లోగా వివరాలను నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

మూడు క్వింటాళ్ల వర్మికంపోస్టు అమ్మకం

కోడూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామ ప్రజలు, వ్యాపారులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రామపంచాయతీ వారి వాహనాలలో వేయాలని పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు కోరారు. సంపద సృష్టి కేంద్రంలో తయారైన వర్మికంపోస్టును గురువారం కడవకొల్లు వీరాంజనేయులు కొనుగోలు చేశారన్నారు. కేజీ రూ.10 చొప్పున మూడు క్వింటాళ్ల వర్మీ కంపోస్టును అమ్మటం జరిగిందని తెలిపారు. వార్డుసభ్యులు వెన్నా ప్రసాద్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

కోడూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని తొమ్మిదో వార్డు నుంచి సంపద సృష్టి కేంద్రం వరకు రూ.24 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. సచివాలయ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజు సంబరం



కోడూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): లింగారెడ్డిపాలెంలో దాసరి వారి పోతురాజు సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. కమిటీ పెద్దల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ - సాయిసుప్రియ దంపతులు విచ్చేసి ఆలయంలో పూజలు జరిపించారు. ఆలయ కమిటీ పెద్దలు దాసరి పోతురాజు, దాసరి వెంకట నరసింహారావు, దాసరి వెంకట కృష్ణారావు, దాసరి చెన్నారావు మండలి వెంకట్రామ్‌ను, సాయి సుప్రియను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ యర్రంశెట్టి శ్రీదుర్గ, గ్రామ ప్రముఖులు యర్రంశెట్టి దామోదర్, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కాటన్ దొర సేవలు మరువలేనివి

మోపిదేవి, మే 15 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి రంగానికి సర్ ఆర్థర్ కాటన్ దొర అందించిన సేవలు మరువలేనివని జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. మోపిదేవి వార్పు వద్ద సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా కాటన్ దొర విగ్రహానికి వెంకట్రామ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇరిగేషన్ ఏఈలు పొన్నూరు రవితేజ, దోవారి విజయ్ కుమార్, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, మండలి శేషు, మండలి సుధీర్, కమతం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



ఘంటసాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : తెలుగురావుపాలెం రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు సబ్సిడీపై వ్యవసాయ శాఖ అందించిన పచ్చిరొట్ట విత్తనాలను సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు, అచ్చెంపాలెం సర్పంచ్ గాజుల నాగ శ్రీనివాసరావు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ చాగంటిపాటి గణేష్ సాయి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోనేరు సెంటర్ నుంచి తిరంగా ర్యాలీ

మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు కోనేరుసెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు తెలిపారు. ఆర్అండ్‌బి అతిథిగృహంలో గురవారం జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, టీడీపీ నగర అధ్యక్షుడు ఇలియాస్ పాషా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంతం వెంకటగజేంద్రరావు, చిరువోలు బుచ్చిబాబు, నాగలింగం అయోధ్యరాము, చలమలశెట్టి రామకృష్ణ తదితరులు విలేకరులతో మాట్లాడారు. తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

గృహిణి ఆత్మహత్య



సుధారాణి (ఫైల్)

మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఇందిరమ్మ కాలనీలో అప్పుల బాధతో మహిళ గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. కరగ్రహారానికి చెందిన సుధారాణికి ఇందిరమ్మ కాలనీకి చెందిన వెంకటేశ్వరరావుతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వెంకటేశ్వరరావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. సుధారాణి (32) వ్యక్తిగత రుణాలు తీర్చలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మచిలీపట్నం పోలీసులు శవపరీక్ష నిర్వహించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు చీరెల పంపిణీ

మచిలీపట్నం టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు చీరెలు పంపిణీ చేశారు. రీజనల్ చైర్‌పర్సన్ వేముల వెంకటనాగ శిరీష క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పేదలకు చీరెలు పంపిణీ చేశారు. 300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు యెండూరి సురేష్, శ్రీకాకుళపు రేణుకారాణి, అన్నం అశోక్, జల్లూరి దివ్యశ్రీ, జల్లూరి రాంబాబు, తమ్మన మధు, తమ్మన ప్రసాద్, కె. నాగలక్ష్మి, శ్రీదేవి, ఆర్. పూర్ణ, సంగీత, పద్మిని తదితరులు పాల్గొన్నారు.